నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 23-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 74 | పేజీలు: 4 | వెల: రూ.1/-

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

బైక్‌పై నుంచి పడి ఇద్దరు దుర్మరణం

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘటనల్లో మొత్తం ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. సికింద్రాబాద్‌లోని విమలనగర్ వద్ద ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని దుండగులు వ్యక్తిని కత్తులతో పొడిచి చంపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. మరొక ఘటనలో షామీర్‌పేట మండలం తుర్కపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు బైక్‌పై ప్రయాణిస్తున్న వీరు ప్రమాదానికి గురై మృతిచెందారు. బైక్ నుంచి జారి పడి ఇద్దరు మృతి చెందారు. శామీర్‌పేట మండలం తుర్కపల్లిలో ఈ ఘటన జరిగింది. సరూర్‌నగర్‌కు చెందిన ప్రేమ్ దాస్, ముకేష్ ఇద్దరు స్నేహితులు.. కొమరవెల్లి మల్లన్న దర్శనం కోసం బైక్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వచ్చే నెల 10న ముకేష్ పెళ్లి ఉండటంతో కొమరవెల్లి మల్లన్న దర్శనం కోసం ప్రేమ్‌దాస్‌తో కలిసి వెళ్లినట్టు తెలుస్తోంది.ఇంతలోనే దురదృష్టం వెన్నాడింది. ఈ ఘటనతో కుటుంబంలో విషాదం అలముకుంది.

ప్రధాని మోడీతో నోబెల్ గ్రహీత అభిజిత్ భేటీ

ట్విట్టర్‌లో వెల్లడించిన ప్రధాని

న్యూఢిల్లీ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి గెలుచుకున్న అభిజిత్ బెనర్జీ.. మంగళవారం

ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశారు. అభిజిత్‌ను కలవడం అద్భుతంగా ఉందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. మానవ సాధికారత కోసం కచ్చితమైన లక్ష్యాలతో అభిజిత్ పనిచేస్తున్నారని ప్రధాని అన్నారు. అనేక అంశాలపై విస్తృతమైన, ఆరోగ్యకరమైన చర్చ నిర్వహించామన్నారు. అభిజిత్ సాధించిన ఘనత పట్ల దేశం గర్వంగా ఫీలవుతుందని మోదీ అన్నారు. భవిష్యత్తులోనూ అభిజిత్ చేపట్టే ప్రాజెక్టులు సక్సెస్ కావాలని ప్రధాని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా పేదరిక నిర్మూలన కోసం అభిజిత్ సూచించిన ప్రణాళికలను నోబెల్ కమిటీ గుర్తించింది. అయితే బీజేపీ ప్రభుత్వ విధానాన్ని అభిజిత్ తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో కొందరు బీజేపీ నేతలు నోబెల్ విజేతపైన కూడా విమర్శలు చేశారు. ఎటువంటి అవకాశం లేకపోవడం వల్ల ప్రజలు మోదీని ఎన్నుకున్నారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బెనర్జీ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై చర్యలు

28న కేబినేట్ సబ్‌కమిటీ భేటీ

హైదరాబాద్,అక్టోబర్22 (ఆంఎన్ఎ): రాష్ట్రంలో అడవుల రక్షణ, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 28న మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కానున్నది. ఈ సమావేశంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్రంలో పచ్చదనాన్ని ఏవిధంగా పెంచాలి? భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి ఎటువంటి విధానాలను అమలుచేయాలి? అనే అంశంపై క్యాబినెట్ సబ్‌కమిటీ చర్చించ నున్నదని అధికారవర్గాలు తెలిపాయి. అటవీ, పర్యావరణ, న్యాయశాఖల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కమిటీ సభ్యులుగా ఉన్న మంత్రులు కే తారకరామారావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొంటారు. సమావేశంలో అడవులశాతం అతితక్కువగా ఉన్న కరీంనగర్, వరంగల్ అర్బన్, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నారాయణపేట జిల్లాలపై ప్రత్యేకంగా చర్చించే అవకాశమున్నదని అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ రికగ్నిషన్ అవ్ ఫారెస్ట్ రైట్స్ (ఆర్వోఎఫ్ఆర్) కింద గిరిజనులకు, ఇతర అర్హులకు పట్టాలను అందజేసే విషయలో కూడా క్యాబినెట్ సబ్‌కమిటీ చర్చించనున్నట్టు తెలిసింది.

18వ రోజు ఉధృతంగా ఆర్టీసీ సమ్మె

- తాత్కాలిక డ్రైవర్లకు, కాండక్టర్లకు పూలిచ్చి నిరసన
- పలు జిల్లాల్లో డిపోలకే పరిమితమైన బస్సులు
- వంటావార్పుతో నిరసన తెలిపిన కార్మికులు
- డ్రైవర్లపై దాడి చేస్తే చర్యలు తప్పవు - నగర సీపీ అంజనీకుమార్

హైదరాబాద్, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికుల సమ్మె రోజురోజుకూ ఉధృతమవుతోంది. 18వ రోజైన మంగళవారం కూడా కార్మికుల నిరసనలు కొనసాగుతున్నాయి. విధుల్లోకి వెళ్లొద్దని తాత్కాలిక సిబ్బందికి కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా బస్సులు నిలిచిపోయాయి. తాత్కాలిక సిబ్బంది విధులకు వచ్చినా డ్యూటీ ఎక్కలేదు. అందుకు కారణం ఆర్టీసీ కార్మికులందరూ కలిసి తమ సమ్మెకు మద్దతు ఇవ్వాలని తాత్కాలిక సిబ్బందిని కోరడమే. ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తోందని తాత్కాలిక సిబ్బందికి గులాబీ పూలు ఇచ్చి కోరుతున్నారు. దీంతో తాత్కాలిక సిబ్బంది ఎవరూ విధులకు హాజరుకాలేదు. అంతేకాదు సమ్మెకు మద్దతివ్వాలంటూ అధికారులు, ప్రజలకు గులాబీ పూలు ఇచ్చి విజ్ఞప్తి చేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ, నార్కెట్‌పల్లి, దేవరకొండ యాదగిరిగుట్ట డిపోల నుంచి బస్సు బయటకు రాలేదు. దీంతో ప్రయాణికులు నానాపాట్లు పడుతున్నారు. దేవరకొండ యాదగిరిగుట్ట డిపోల్లో తాత్కాలిక సిబ్బందిని బతిమలాడుతున్న ఆర్టీసీ సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నల్గొండ, దేవరకొండ, యాదగిరిగుట్ట, మిర్యాలగూడ, నార్కెట్‌పల్లి డిపోల్లో భారీగా పోలీసులను మోహరించారు. కార్మికులను అరెస్ట్ చేసి బస్సులను డిపోల్లో నుంచి బయటకు తీయాలని అధికారులు భావిస్తున్నారు. మంగళవారం తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లకు పూలిచ్చి తమ నిరసన తెలుపుతున్నారు. తమ డిమాండ్ల కోసం చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలపాలని కోరుతున్నారు. తమ స్థానంలో విధులు నిర్వహిస్తూ.. తమ పొట్ట కొట్టవద్దని వేడుకుంటున్నారు. తెల్లవారు జాము నుంచే డిపోల ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. సికింద్రాబాద్, జేబీఎస్ దగ్గర పెద్ద ఎత్తున వంటా వార్పు చేపట్టారు కార్మికులు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంతేకాకుండా.. తెలంగాణ వ్యాప్తంగా.. ఏ జిల్లాకు చెందిన ఆర్టీసీ కార్మికులు.. ఆ బస్ డిపోలో సమ్మెలు చేస్తున్నారు. ఆర్టీసీ సమ్మెతో విద్యార్థులు, ఉద్యోగులపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కొరత కారణంగా వారు నానా పాట్లు పడుతున్నారు. కాలేజీలకు, ఆఫీసులకు వెళ్లేందుకు ఆటోలను, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

డ్రైవర్లపై దాడి చేస్తే చర్యలు తప్పవు - నగర సీపీ అంజనీకుమార్

రాష్ట్రంలో బస్సులు నడుపుతున్న ప్రైవేటు డ్రైవర్లకు ఆటంకం కలిగించి వారిపై దాడి చేస్తే చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులు, మిగిలిన ప్రైవేటు వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను అడ్డుకుంటున్న వారికి హెచ్చరికలు జారీ చేశారు. సమ్మె చేస్తున్న యూనియన్లు ప్రైవేటు వ్యక్తులపై దాడి చేస్తున్నారని, అలా చేసే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న డ్రైవర్లకు ఆటంకం కలిగిస్తే పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామని వెల్లడించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారికి ఫాస్టాక్ కోర్టు విచారణ ద్వారా వెంటనే శిక్ష పడుతుందని తెలిపారు.

ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తాం

- సూర్యాపేటను సస్యశ్యామలం చేయాలన్నదే కేసీఆర్ సంకల్పం
- మాట ఇచ్చి మడమతిప్పని వ్యక్తి సీఎం కేసీఆర్
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- పెన్పహాడ్ మండలానికి గోదావరి నది జలాలు
- గోదావరి నీటికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి

సూర్యాపేట, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తామని, తద్వారా సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చేస్తామని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా పెన్పహాడ్ మండలానికి కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా గోదావరి నది జలాలు చేరుకున్నాయి. గోదావరి జలాలకు మెఖ్యా తండా పరిధిలోని గేల్ పైప్ లైన్ వద్ద జగదీష్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. మొట్టమొదటి సారిగా తమవద్దకు కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు చేరుకోవడంతో మండల ప్రజలు సంబరాలు జరుపుకున్నారు . ఈ సందర్భంగా మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ...ఇచ్చిన మాట ప్రకారం పెన్పహాడ్ మండలానికి గోదావరి నీళ్లు తీసుకువచ్చాం. వచ్చే దీపావళి నాటికి అందిస్తామన్న మాటను నిలబెట్టుకున్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పడు.... మడమ తిప్పడు అన్నది మరోమారు రుజువైందన్నారు. కిందటి దీపావళి పండుగ సందర్భంగా చినగారకుంటతండాలో ఇచ్చిన మాట నేడు నిజమైందని మంత్రి తెలిపారు. గేల్ పైప్ లైన్ కింది నుండి తవ్వాల్సిన కాలువలను తవ్వకుండా వదిలేశారని, పది సంవత్సరాలు పూర్తి అయినా కాలువ అటువైపు ఇటువైపు తవ్వి నిర్లక్ష్యం చేసి వదిలేశారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే కేసీఆర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామని, వెంటనే నిధులు మంజూరు చేసి గేల్ అనుమతితో కాలువనుపూర్తి చేశామన్నారు. నేడు రావిచెరువు, మొల్గాపురంతో పాటు చిదేళ్ల చెరువు, అన్ని తండాలకు గోదావరి జలాలు

అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మా నియోజకవర్గం పెన్ పహాడ్ మండలం చివరి అంచు నుంచి నాగార్జునసాగర్ ఎడమ కాలువ వేదుతుందని, పై గ్రామాల ప్రజలు ఆ నీరు మాకు వస్తే బాగుండనని పరితపించి పోయారన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని కృష్ణా కంటే కూడా ఈ ప్రాంతానికి గోదావరి జలాలు నికర జలాలుగా గుర్తించామని మంత్రి తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా అందిస్తామని గత పాలకులు చెప్పినా అది బూటకం అని తేలిపోయిందని మంత్రి అన్నారు. ఎస్ఆర్ఎస్పీ నీళ్లు ఇంత దూరం రావాల్సిన స్థాయిలో లెవన్నది వాస్తవమని, ప్రజలను మోసం చేయడానికే ఆ రోజు మాయమాటలు చెప్పారని విమర్శించారు. ప్రజలు, రైతులు ఎదురు చూస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించారని, రైతాంగానికి నీళ్లు అందించి సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చేయాలన్నది సీఎం కేసీఆర్ సంకల్పమని మంత్రి తెలిపారు. కాళేశ్వరం ద్వారా ఇక్కడి రైతాంగాం కలలు నెరవేర్చాలన్న లక్ష్యం ఈరోజుకు పూర్తి అయిందని మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. గోదావరి జలాలతో రావి చెరువు నింపాలన్నది ఇక్కడి ప్రజాల డిమాండ్ అని, రావిచెర్వుతో పాటు మండలంలోని అన్ని చెరువులకు గోదావరి నీళ్లు అందిస్తామని అన్నారు. పెన్పహాడ్ మండలంలో సాగర్ ఆయకట్టు ద్వారా పారుతున్న పొలాలు మినహా మిగతా అన్ని భూములకు గోదావరి జలాలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఇంచు భూమికి నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు లైన్‌క్లియర్!

- ఎన్నికల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన హైకోర్టు
- అన్ని పిటీషన్‌లను కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు లైన్ క్లియర్ అయింది. ఎన్నికల నిర్వహించుకోవచ్చని ప్రభుత్వానికి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల ఏర్పాట్లు చట్టబద్ధంగా జరగడం లేదంటూ దాఖలైన అన్ని పిటీషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. మున్సిపల్ ఎన్నికలపై గత మూడు నెలల నుంచి హైకోర్టులో వాదప్రతివాదనలు జరిగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత తుది తీర్పును ప్రకటిస్తామని గతంలోనే హైకోర్టు చెప్పింది. మున్సిపల్ ఎన్నికలను నిర్వహించుకోవచ్చని హైకోర్టు మంగళవారం తుది తీర్పును వెలువరించింది. మున్సిపల్ ఎన్నికలను 119 రోజుల్లో నిర్వహించాలని జూన్ 25న హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల పక్రియను తక్షణమే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి న్యాయస్థానం సూచించింది. వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు మొదలైన అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదంటూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం హైకోర్టును ఆశ్రయించడంతో.. న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది. తెలంగాణలో మొత్తం 128 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ వరంగల్, గ్రేటర్ ఖమ్మం కార్పొరేషన్ల పదవీ కాలం ఇంకా పూర్తి కాలేదు. ఈ క్రమంలో 10 నగరపాలికలకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు 128 మున్సిపాలిటీల్లో సిద్దిపేట, అచ్చంపేట పురపాలక స్థానాలు పదవీ కాలం పూర్తి కాలేదు. అంతేకాకుండా కొన్ని సమస్యల వల్ల మరో ఐదు పురపాలక స్థానాల్లో ఎన్నికలు నిర్వహించడం సాధ్యపడలేదు. దీంతో త్వరలో రాష్ట్రంలో 121 మున్సిపాలిటీలకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి.

చిదంబరానికి ఊరట!

- బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

హైదరాబాద్, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : ఐఎన్ఎక్స్ మీడియా కేసులో మాజీ కేంద్ర మంత్రి చిదంబరానికి ఊరట లభించింది. మంగళవారం సుప్రీంకోర్టు చిదంబరానికి బెయిల్ మంజూరీ చేసింది. ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో.. మాజీ కేంద్ర మంత్రి బెయిల్ కోసం సుప్రీం తలపు తట్టారు. అయితే మంగళవారం సుప్రీం బెయిల్ ఇచ్చినా.. కాంగ్రెస్ నేత మాత్రం ఇంకా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ కస్టడీలోనే ఉన్నారు. ఇద్దరు సాక్షి సంతకాలతో చిదంబరం.. లక్ష రూపాయాల బాండ్‌ను సమర్పించాల్సి ఉంటుంది. చిదంబరం తన పాస్‌పోర్ట్‌ను ట్రయల్ కోర్టులో అప్పగించాలి. కోర్టు అనుమతితోనే ఆయన విదేశాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు అక్రమ పద్ధతిలో విదేశీ పెట్టుబడులు అందే విధంగా చిదంబరం అనుమతి ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఈ ఏడాది ఆగస్టు 21వ తేదీన చిదంబరాన్ని అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన తీహార్ జైల్లోనే ఉన్నారు. కేంద్ర ఆర్థికమంత్రిగా ఉన్న సమయంలో చిదంబరం అవినీతికి పాల్పడ్డారు. ఐఎన్ఎక్స్ మీడియాకు పర్మిషన్ ఇచ్చేందుకు ఆయన లంచం తీసుకునారు. దీంతో చిదంబరంపై 2017, మే 15వ తేదీన సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అదే ఏడాది ఈడీ కూడా మనీల్యాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈడీ కేసు విచారణలో భాగంగా చిదంబరాన్ని ఇంకా కస్టడీలోనే ఉంచారు.

మిమ్మల్ని చూసి దేశం గర్విస్తోంది

- నోబెల్ విజేత అభిజిత్‌తో భేటీపై ట్విటర్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : నోబెల్ పురస్కార విజేత ఆర్థిక వేత్త అభిజిత్ బెనర్జీని ప్రధాని మోదీ మంగళవారం ఢిల్లీలో కలిశారు. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా వెల్లడించిని మోదీ.. అనేక అంశాల గురించి ఆరోగ్యకరమైన, విస్తృతమైన చర్చ జరిపామని తెలిపారు. బెనర్జీ భవిష్యత్తులో తలపెట్టే పనులు విజయవంతం కావాలని ప్రధాని ఆకాంక్షించారు. ఆయన సాధించిన విజయాల పట్ల దేశం గర్విస్తోందన్నారు. ప్రధానితో భేటీ అనంతరం విలేకరులతో మాట్లాడిన బెనర్జీసైతం ప్రధానితో భేటీ ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మోదీ తనకు సమయం కేటాయించడం ఆనందం కలిగించిందన్నారు.

భారతదేశం గురించి తన ఆలోచన విధానాన్ని ప్రధాని మోదీ వివరించారని, తన పాలన గురించి తెలిపారని బెనర్జీ వెల్లడించారు. ఉద్యోగ వ్యవస్థ మరింత బాధ్యతాయుతంగా ఉండటం కోసం ప్రక్షాళన చేయడానికి ప్రధాని ప్రయత్నిస్తున్నారని బెనర్జీ తెలిపారు. దేశానికి ఇదెంతో ముఖ్యమన్నారు. పేదరిక నిర్మూలన కోసం చేసిన కృషికిగానూ 2019లో ఆర్థిక శాస్త్రంలో బెనర్జీకి నోబెల్ పురస్కారం దక్కిందన్నారు. భారత్‌లో జన్మించిన ఆయన అమెరికాలోని మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి ఎకనమిక్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల వ్యవసాయం రంగం ప్రభావితమైందని.. పంటలకు సరైన ధరలు రావడం లేదని బెనర్జీ గతంలో వ్యాఖ్యానించారు. కార్పొరేట్ ట్యాక్స్ తగ్గించడం వల్ల వృద్ధిరేటు పెరగదన్న ఆయన.. ప్రత్యక్ష పన్నులను అదుపు చేయడం వల్ల ఫలితం ఉంటుందన్నారు. బెనర్జీ వామపక్ష భావజాలం ఉన్న వ్యక్తి అని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ తీసుకొస్తామని చెప్పిన న్యాయ్ పథకంపై బెనర్జీ ప్రశంసలు గుప్పించారు.

అద్దె బస్సుల టెండర్లపై హైకోర్టులో పిటిషన్

- విచారణ 28కి వాయిదా

హైదరాబాద్, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ అద్దె బస్సుల టెండర్లను పిలవడాన్ని సవాలు చేస్తూ కార్మిక సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. 1035 బస్సులను అ÷-దదెకు తీసుకోవడం కోసం టెండర్లు ఆహ్వానిస్తూ ఆర్టీసీ యాజమాన్యం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఆర్టీసీకి బోర్డు లేకుండా ఎండీ టెండర్లు పిలవడం చట్ట విరుద్ధమని పిటిషనర్ ఈ సందర్భంగా కోర్టుకు తెలిపారు. కార్మికుల సమ్మెపై ఏ విషయం తేల్చకుండా శాశ్వత ప్రాతిపదికన అద్దె బస్సులు తీసుకుంటున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. అయితే ఆర్టీసీ తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్.. ఆర్టీసీ సొంత బస్సులను నడిపే పరిస్థితుల్లో లేదని కోర్టుకు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు అద్దె బస్సులు తీసుకుంటున్నామని అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. ఈ పిటిషన్‌ను ఇప్పటివరకు ఆర్టీసీపై దాఖలై పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలపాలని ఆదేశించింది. అన్ని పిటిషన్లపై ఈ నెల 28న వాదనలు వింటామని తెలిపింది.

తీరం భద్రంగా ఉంది

- నేవీ పటిష్ఠ నిఘా చేపడుతుంది
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : భారత నావికాదళం నిఘా నీడలో దేశ తీరప్రాంతమంతా భద్రంగా ఉందని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరుగుతున్న 'నావెల్ కమాండర్స్ కాన్ఫరెన్స్'లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. 26/11లాంటి దాడులు మరోసారి జరగకుండా నేవీ పటిష్ఠ చర్యలు చేపడుతోందన్నారు. భారత్ ఎప్పుడూ తప్పులు చేయలేదని, కావాలని ఏ దేశంపైనా దాడికి పాల్పడలేదన్నారు.

పరాయి భూమిని కనీసం అంగుళం కూడా బలవంతంగా లాక్కోలేదని, కానీ, భారత్‌ను తప్పుడు దృష్టితో చూసేవారికి తగిన గుణపాఠం చెప్పే సామర్థ్యం మన సాయుధ బలగాలకు ఉందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. భారత నేవీ నిఘా నీడలో సముద్రమార్గం అత్యంత సురక్షితంగా ఉందని, ముంబయి దాడుల వంటి ఘటనలు మరోసారి జరగకుండా నావికాదళం చర్యలు తీసుకుంటోందని రాజ్‌నాథ్ చెప్పుకొచ్చారు. 2008 నవంబరు 26న దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో భీకర ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. సముద్ర మార్గం గుండా దేశంలోకి చొరబడిన లష్కరే తోయిబా ఉగ్రవాదులు ముంబయిలోని 12 చోట్ల వరుస పేలుళ్లకు పాల్పడ్డారు. ఈ ఘటనలో వందల మంది ప్రాణాలు కోల్పోయారు.

చరిత్రలో నేటినిజం

కం॥ వైరాగ్యపు భావనలో
పైరా స్వేచ్ఛను జయించి నయసుణామఠయై
'భైరనుసింగు షెకావతు'
'పైరులు ఎకయాళు' యాంతె భాసించె భరనే!!

(అక్టోబర్ 23 భైరనుసింగు షెకావతు జననం) -రాధశ్రీ

సెల్: 9494481210

సూర్యాపేట హైవేపై రెండు కార్లుదగ్ధం

- నలుగురికి గాయాలు

సూర్యాపేట, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : సూర్యాపేట హైవేపై మంగళవారం ఉదయం సినీఫక్కీలో ప్రమాదం జరిగింది. మునగాల మండలం మాధవరం శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని మంటల్లో చిక్కుకున్నాయి. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్నవారు అప్రమత్తమై బయటకు దూకడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. నరేంద్ర అనే వ్యక్తి భార్యతో కలిసి కోదాడ నుంచి హైదరాబాద్ వైపు కారులో వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు ప్రయాణిస్తున్నవారు ఇండికా కారు మాధవరం వద్ద అదుపుతప్పి డివైడర్ దాటి వచ్చి ఢీ కొట్టింది. దీంతో స్వల్పంగా కారులో మంటలు రావటాన్ని గమనించిన కారులోని ప్రయాణికులు వెంటనే కిందికిదిగే ప్రయత్నం చేశారు. అప్పటికే మంటలు ఒక్కసారిగా చెలరేగడంతో రెండు కార్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న మునగాల పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని సహాయచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను కోదాడలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మౌలిక సమస్య ఇదే!

నేటినిజం
బుధవారం 23-10-2019

దేశంలో ప్రతి సంవత్సరం ఉత్తీర్ణులు అవుతున్న ఇంజనీరింగ్ పట్టభద్రులు సంఖ్య ఎనిమిది లక్షలు. అంటే సగటున ఏటా ఐదు లక్షల మంది నిరుద్యోగులను కేవలం 'ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూషన్లు' ఉత్పత్తి చేస్తున్నాయి. ఇంజనీరింగ్ కళాశాలల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందదనడానికి కారణం నిరుద్యోగం. తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కలాశాలలో యాభైశాతం సీట్లు' ఈ ఏడాది భర్తీ కాలేదట! కళాశాలల సంఖ్య తగ్గిపోవడం, ఉన్న కళాశాలల్లో సీట్లు భర్తీకాకపోవడం దేశమంతటా నకిలీ విద్యాసంస్థలు పుట్టుకుని వచ్చాయి. పరీక్షలు రాయని వారికి, కళాశాలలకు వెళ్లనివారికి 'పట్టాలు' లభిస్తుండటం విద్యావ్యాపారంలో జరుగుతున్న అక్రమాలకు కొన్ని నిదర్శనాలు మాత్రమే! ఇటీవలి కాలంలో సంవత్సరమంతా కళాశాలకు హాజరు కాని విద్యార్థులకు యాజమాన్యాలు అటెండెన్స్ ఇవ్వడం ఓ ఫ్యాషనైపోయింది. ఇలా కాలేజీ ముఖం చూడని విద్యార్థులను కాలేజీకి వచ్చినట్లుగా పరిగణించడాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇది అనధికార, అనైతిక దూరవిద్య, దేశంలో రెండు వందల డెబ్బై తొమ్మిది ఇంజనీరింగ్, టెక్నికల్ విద్యాసంస్థలు 'ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్' ఏఐసిటిఇ –అనుమతి లేకుండానే పనిచేస్తున్నట్లు ప్రస్తుత సమాచారం! ఒక్క హైదరాబాద్‌నగరంలోనే ఇలాంటి ముప్పై ఐదు సంస్థలు అక్రమంగా మొలుచుకొని వచ్చి 'ఏఐసిటీఇ' వెల్లడించింది. ఇలా వెల్లడి చేసిన తర్వాత కూడా ఈ 'నకిలీ' సంస్థలు ఇంజనీరింగ్, ఎంబిఏ, ఫార్మసీ వంటి కోర్సులలో విద్యార్థులను చేర్చుకుంటూనే ఉన్నాయట!

పట్టభద్రుల సంఖ్యను స్నాతకోత్తర సంఖ్యను స్నాతకోత్తరుల సంఖ్యను పెంచడం, పట్టాల పొందిన వారందరికీ ఉద్యోగాలనివ్వడం– ఈ రెండు లక్ష్యాల ప్రాతిపాదికగా మన ఉన్నత విద్యావిధానం కొనసాగుతోంది. నిజంగా ప్రతిభ ఉన్న వారు మాత్రమే 'ఉత్తీర్ణులు' కావాలన్నది పాత కథ. 'అవ్యవస్థిత చిత్తానాం ప్రసాదోపి భయంకర:'–అస్తవ్యస్తంగా ఆలోచించేవారు చేసే మంచి కూడా భయంకరమైన పరిణామాలను కలిగిస్తుంది అని అన్నట్టుగా 'సంఖ్య'ను పెంచాలన్న ప్రభుత్వాల విధానం రకరకాల వైపరీత్యాలను కూడా సృష్టించింది. విద్యావంతులు సౌశీల్యవంతులుగా కూడా రూపొందడానికి వీలైన పాఠ్యప్రణాళికలు గతంలో ఉండేవి. అవి మూతపడిపోవడం వల్ల సౌశీల్యం లేని విద్యావంతులు అధిక సంఖ్యలో తయారయ్యారు. ఈ 'విద్యా' వంతులు విద్యావ్యాపారులుగా 'నకిలీ' సంస్థలను నిర్వహిస్తున్నారు. ఇపుడు మనకు ఎదురవుతున్న మౌలిక సమస్య ఇదే! ఇలా విద్యావంతులు కాని వారు విద్యావంతులుగా ముద్రలు వేసుకుంటుండటం వాణిజ్య విద్యా సంస్థలు–కార్పొరేట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ పుట్ట పుట్టలుగా పెరిగిపోతుండటం వల్ల సంభవించిన విపరీత పరిణామం. 'ప్రపంచీకరణ–గ్లోబలైజేషన్' వల్ల ఈ విపరీత పరిణామాలు మరింతగా ప్రభావితం చేస్తోంది. భారీగా శుల్కాల ఫీజస్‌ను దండుకుంటున్న 'కార్పొరేట్' విద్యా సంస్థల వారు తమ సంస్థల్లోని విద్యార్థులందరూ గొప్ప ప్రతిభతో ఉత్తీర్ణులవడానికి వ్యవస్థలు ముందే ఏర్పరుచుకోవడం హాస్యాస్పదం. ఇదొక మాయాజాలం. వీటిని చేధించడం ఎప్పటికి కుదురుతుందో.. ??

రైతుబంధుతో పెరిగిన సాగు విస్తీర్ణం

ఆ మేరకు ధాన్యం దిగుబడి అధికారుల అంచనా

ఖమ్మం,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం సాగు విస్తీర్ణం పెంపుపై ప్రభావం చూపడంతో ధాన్యం దిగుబడులు పెరిగాయని భావిస్తోంది. గత సంవత్సరం జిల్లాలో సాగైన విస్తీర్ణం గణాకాలు పరిశీలిస్తే అర్థం అవుతుందన్నారు. . గత సంవత్సరం వానాకాలం సీజన్లో జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 2.30 లక్షల హెక్టార్లు కాగా, ఈ ఏడాది దాదాపు 2.35 లక్షల హెక్టార్లలో రైతులు సాగు చేశారు. ఒక వైపు సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం, సాగర్ కాలువ ద్వారా నీటి విడుదల కావడంతో రైతులు నూతన ఉత్సాహంతో సాగు చేస్తున్నారు. ప్రభుత్వమే స్వయంగా పంట పెట్టుబడి అందిస్తుడంటంతో గతంలో భూమిని కౌలుకు ఇచ్చిన రైతులు సైతం స్వయంగా సాగు చేసుకోవడం విశేషం. అదే విధంగా వ్యవసాయాన్ని వదులుకొని పట్టణాలకు, నగరాలకు వలస వెళ్లిన వేలాది మంది రైతులు తిరిగి తమ ప్లలెలకు చేరుకొని పంటు పండిస్తున్నారు. రైతుల ఇబ్బందులను పరిగణంలోకి తీసుకొని సర్కార్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం రైతాంగానికి సైతం మేలు చేకూర్చిందని అంచనా వేస్తున్నారు.గత సంవత్సరం వానాకాలం, యాసాంగి సీజన్‌లకు సంబంధించి ఎకరానికి రూ.8వేల చొప్పున అందించింది ప్రభుత్వం. రైతుల కోరిక మేరకు, పెరిగిపోతున్న పంటల పెట్టుబడిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని పెంచింది. ఈ సంవత్సరం రెండు సీజన్‌లకు కలిపి ఎకరానికి రూ.10 వేల చొప్పున అందింస్తుంది. గత కొద్ది రోజుల నుంచి రైతుల అకౌంట్లో ఎకరానికి రూ.5వేల చొప్పున పంటల పెట్టుబడి జమ చేశారు. ఈ నెల చివరి నాటికి ఖరీఫ్‌కు సంబంధించిన పంటల పెట్టుబడి సొమ్మును అర్హత కలిగిన ప్రతీ రైతుకు అందించేందుకు గాను ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. మరికొద్ది రోజుల్లో యాసాంగి సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పక్రియ వేగవంతం చేశారు. దీంతో వచ్చే నెల చివరిలో కాని, నవంబర్ నెల మొదటి వారంలో యాసాంగి పెట్టుబడి సాయం ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. తెలంగాణ సర్కార్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం జిల్లాలో గత వారం రోజుల నుంచి మిగిలిన రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే జిల్లావ్యాప్తంగా రైతులకు పంటల పెట్టుబడి సొమ్ము వారి ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసింది. కొన్ని సాంకేతిక కారణాల వలన దాదాపు 40శాతం మంది రైతులకు అందలేదు. దీంతో సదరు రైతులకు సైతం ప్రభుత్వం రైతుబంధు సొమ్మును తిరిగి గత వారం రోజుల నుంచి జమ చేస్తున్నారు. గత సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్‌లలో కలిపి ఎకరానికి రూ.4వేలు చొప్పున పంటల పెట్టుబడి అందించి ప్రభుత్వం. గత ఏడాది వానాకాలం సీజన్‌లో 2.85 లక్షల మంది రైతులకు గాను రూ.275.03 కోట్లు అందించారు. యాసాంగి సీజన్‌లో 2.74 లక్షల మంది రైతులకు గాను రూ.270.84 కోట్లు అందించారు. ఇక పోతే ఈ సంవత్సరం ఖరీఫ్‌కు సంబంధించి నేటి వరకు 2.81 లక్షల మంది రైతులకు గాను రూ.226.55 కోట్లు జమ చేశారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో రూ.345.49 కోట్లు పంటల పెట్టుబడిగా ప్రభుత్వం రైతులకు అందివ్వాలని నిర్ణయం తీసుకుంది. మరికొద్ది రోజుల్లోనే మిగిలిన రైతులకు వారి అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు చెరువుల వల్ల కూడా సాగు పెరిగిందని అంటున్నారు.

కొత్తగూడెం జిల్లాలోని 2396 చిన్న నీటి చెరువుల ద్వారా 1,29,188 ఎకరాలు సాగవుతున్నట్లు కలెక్టర్ రజత్‌కుమార్‌శైనీ అన్నారు. పెద్ద, చిన్న తరహా నీటిపారుదల ద్వారా సాగవుతున్న పంటల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కిన్నెరసాని, పెద్దవాగు, తాలిపేరు పెద్దతరహా నీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా 30,200 ఎకరాలు సాగవుతుందన్నారు. మిషన్ కాకతీయ 1317 చెరువుల అభివృద్ధి ద్వారా 83,353 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1297 చెరువుల అభివృద్ధి పనులు పూర్తి చేసి 72,298 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు.

70 చెరువుల అభివృద్ధి పనులు చేపట్టగా 65 చెరువుల అభివృద్ధి పనులు పూర్తి చేసి 32,945 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా 81 చెక్‌డ్యామ్ పనులు చేపట్టగా 57 పనులు పూర్తి చేశామని సూచించారు. పంట కాలువల నిర్మాణం కోసం కావాల్సిన భూమికి రూ.76.60 లక్షలు వెచ్చించామన్నారు.

తుంగభద్రకు భారీగా వరదనీరు

ఎగువన వర్షాలతో జలకళ

జోగులాంబ గద్వాల,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): తుంగభద్ర నది ఉరకలెత్తుతోంది. అల్ప పీడన ద్రోణి ప్రభావంతో కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో డ్యాం 33 గేట్లు ఎత్తి స్పిల్ వే ద్వారా 1,55,431 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో సైతం 1,55,431 క్యూసెక్కులు ఉండగా, అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం వరద పోటు పెరిగే సూచనలు ఉండటంతో 2 లక్షల క్యూసెక్కులు విడుదల చేసే అవకాశం ఉందని తుంగభద్ర బోర్డ్ సెక్షన్ అధికారి విశ్వనాథ్ చెప్పారు. డ్యాంలో ప్రస్తుతం 100.663 టీఎంసీల నీటి నిల్వ ఉందని తెలిపారు. తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేసిన నీరు బుధవారం నాటికి ఆర్డీఎస్ ఆనకట్టకు చేరుకోనుంది. అక్కడి నుంచి సుంకేసుల బ్యారేజీకి వరద చేరుకునే అవకాశం ఉందని ఆర్డీఎస్ అధికారులు చెబుతున్నారు. తుంగభద్ర డ్యాం నుంచి 33 గేట్ల ద్వారా 1,55,431 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేయడంతో తెలంగాణ, ఏపీ, కర్ణాటక అధికారులను అప్రమత్తంగా ఉండాలని తుంగభద్ర బోర్డ్ హెచ్చరిక జారీ చేసింది. ఆయా రాష్ట్రాల కలెక్టర్లు, ఆర్డీవోలు, ఇరిగేషన్, రెవిన్యూ యంత్రాగానికి ఉత్తర్వులు జారీ చేసింది. తుంగభద్ర నదితీర ప్రాంత ప్రజలను నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది.

సావర్కర్ విషయంలో బోల్తాపడ్డ కాంగ్రెస్

హైదరాబాద్, అక్టోబర్ 22:మహారాష్ట్ర,హర్యానా అసెంబ్లీ ఎన్నికలు ముగిసాయి. ఎగ్జిట్ పోల్స్ మేరకు మరోమారు బిజెపి అధికారం దక్కించుకోవడం ఖాయమని తేలింది. విపక్షాల పేలవమైప పాత్ర కారణంగా బిజెపి ముందు అవి నిలవలేక పోయాయి. ప్రచారంలో ఎక్కడా అవి ప్రభావం చూపలేదు. అలాగే జాతీయాంశాల విషయంలో బిజెపి ముక్కుసూటిగా ప్రజలకు సందేశం ఇవ్వగలిగింది. సావర్కర్‌కు భారతరత్న విషయంలో పెద్ద దుమారమే చెలరేగింది. సావర్కర్ భారతరత్నకు అర్హుడని బిజెపి చేసిన వాదన ప్రజల్లోకి చొచ్చుకుని వెళ్లిందనే చెప్పాలి. అయితే ఈ విషయంలో కాంగ్రెస్ స్పష్టమైన వైఖరి తీసుకోలేదనే చెప్పాలి. సావర్కర్ ఓ సుశిక్షితుడైన కార్యకర్త అంటూ కాంగ్రెస్ అధికారప్రనిధి అభిషేక్ సింఘ్వీ ఆలస్యంగా స్పందించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. వీర సావర్కర్, జాతీ యావాదంపై సోనియా, రాహుల్ కాంగ్రెస్ పార్టీకి ఓ విధానం అంటూ లేదని తేలిపోయింది. వీరసావర్కర్ పట్ల కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అయోమయం మరోసారి రుజువయ్యింది. మహారాష్ట్ర ఎన్నికల్లో ఇది కాంగ్రెస్‌ను బాగా బహీన పరిచిందనే చెప్పాలి. సావర్కర్‌కు భారతరత్న అవార్డుపై తాజా వివాదం కాంగ్రెస్‌ని దోషిగా నిలబెట్టిందనే చెప్పాలి. సావర్కర్‌ని నాజీగా, గాంధీ హత్యకు కుట్రదారుగా ముందు నుంచి వాదిస్తోంది. అదే ఇప్పుడు దాని నైజాన్ని బట్ట బయలు చేయడం ద్వారా ప్రజల ముందు దోషిగా నిలబెట్టింది. బిజెపి తెలివిగా ఎన్నికల్లో ఈ అంశానికి ప్రాధాన్యం ఇచ్చింది. సావర్కర్ గురించి దివంగత ప్రధాని వాజ్‌పేయ్ చేసిన వ్యాఖ్యలు కూడా సోషాల్ మీడియా బాగా పేలాయి. మేం సావర్కర్‌జీని గౌరవిస్తాం కానీ ఆయన భావజాలంతో ఏకీభవించలేం అంటూ మన్మోహన్ సింగ్ చెప్పడానికి ప్రయత్నించినా ప్రజలు ఎందుకనో దాన్ని నమ్మలేదు. కాంగ్రెస్ పార్టీకి ఈ సున్నితమైన అంశంపై స్పష్టత లేదని అర్థమయ్యింది. 1970లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ సావర్కర్ గౌరవార్థం పోస్టేజీ స్టాంప్ విడుదల చేసిన చిత్రాన్ని, సావర్కర్‌కి ఇందిర అందించిన నివాళిని గుర్తు చేస్తూ ప్రత్యేకించి సావర్కర్ వీరాభిమానులు కూడా సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీనిని కూడా అందిపుచ్చుకుని ముందుకు సాగే దిశగా కాంగ్రెస్ ప్రయత్నించలేదు. దీనికితోడు ఓ సమర్థ నాయకత్వం కాంగ్రెస్‌కు లేదన్న విషయం కూడా ఇక్కడ మరోమారు బట్టబయలు అయ్యింది. సావర్కర్ జీవితంపై డాక్యుమెంటరీకి ఇందిర ప్రోత్సాహమివ్వడమే కాకుండా ఆయన స్మారక నిధికి రూ.11,000 డొనేషన్ కూడా ఇచ్చారు. పీవీ నరసింహారావు లాంటి ఉదాత్త లక్షణాలు ఉన్న వ్యక్తులు లేని కారణంగా కాంగ్రెస్‌లో విధానపరమైన సిద్ధాంతాలకు దూరంగా ఉంటోంది. నిజానికి పివిలాంటి వ్యక్తి ఇవాళ కాంగ్రెస్‌లో ఉండి వుంటే సావర్కర్ విషయంలో అనుకూలంగా స్పందించి బిజెపిని ఇరుకున పెట్టివుండే వారు. కానీ అలా జరగేలదు. పీవీని కాంగ్రెస్ పార్టీ తృణీకరించడమే గాకుండా, పార్టీలో ఆయనకు స్థానం లేకుండా చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ నేతలు మళ్లీ పార్టీ పాత తరహా కరడుగట్టిన లౌకికవాదానికి మళ్లాలని డిమాండు చేస్తున్నారు. గాంధీ, నెహ్రూ వంశానికి చెందని ఎవరినైనా కౌగిలించుకోవడానికి ఆరెస్సెస్ సిద్ధంగా ఉంది. మోదీ ప్రభుత్వం ఇప్పుడు నెహ్రూ కంటే సర్దార్ పటేల్‌ని భారత గణతంత్ర రాజ్య సంస్థాపకుడిగా గట్టిగా ప్రచారం చేస్తోంది. నెహ్రూతో పటేల్ విభేదాలు మరింత బలంగా ఉన్నాయి కాబట్టే కాంగ్రెస్ నుంచి బీజేపీ లాగేసుకున్న తొలి ప్రముఖ వ్యక్తిగా పటేల్ నిలిచారు. ఇందిర కాంగ్రెస్‌కు, నేటి కాంగ్రెస్‌కి మధ్య ఉన్న వ్యత్యాసం గమనిస్తూ దూరదృష్టి లోపం స్పష్టంగా కనిపిస్తుంది. శబరిమల, ట్రిపుల్ తలాక్, అయోధ్య వంటి ప్రతి అంశంలోనూ కాంగ్రెస్ తప్పుడు విధానాలను అవలంబిచింది. 370 ఆర్టికల్ రద్దు విషయంలోనూ అదే వైఖరి అవలంబించి బోల్తాపడింది. తాజాగా సావర్కర్ విషయంలో కూడా అదే తప్పు చేసింది. ఇదంతా కూడా మేధావివర్గాన్ని దూరం చేసుకున్న పాపంగా చూడాలి. వారసత్వ రాజకయీఆలకు అలవాటు పడ్డ పార్టీలో తానా అంటే తందానా అనే వారికే ప్రాధాన్యం ఉంటుంది. పివి లాంటి జ్ఞాన దురంధురులకు స్థానం ఉండదు. తాము అధికారంలోకి వస్తే సావర్కార్‌కు భారత రత్న ఇప్పిస్తామని మహారాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోలో బిజెపి పేర్కొనడం,దానిని కాంగ్రెస్ వ్యతిరేకించడం చూస్తుంటే సమయస్ఫూర్తి లేని పార్టీగా గుర్తించాలి. అందుకే మహారాష్ట్రలో మరోమారు బిజెపి పాగా వేయబోతోంది. భారత రత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికే సర్వాధికారాలు ఉన్నాయి. అందువల్ల వారు తలచుకుంటే ఇది చాలా సులువే. కానీ అలా చేయడం బిజెపికి ఇష్టం లేదు.ఈ విషయం లో చర్చచేసి కాంగ్రెస్‌ను దోషిగా నిలిపే ప్రయత్నంలో బిజెపి విజయం సాధించింది. స్వాతంత్రోద్యమ కాలంలో బ్రిటీష్ అధికారుల హత్య ఆరోపణపై 50 ఏళ్ల జైలు శిక్ష వేసి బ్రిటీష్ ప్రభుత్వం సావర్కార్‌ను అండమాన్ జైలులో నిర్బంధించింది. సావర్కార్ ఆ జైలులో చేరిన ఒక నెల లోపే బ్రిటీష్ ప్రభుత్వాన్ని క్షమాభిక్ష కోరుతూ, తనను విడుదల చేయాలని లేదా ప్రధాన భూభాగం లోని జైలుకు తరలించాలని లేఖ రాసాడు. దీనిపై ప్రభుత్వం స్పందించక పోవడంతో మరలా 1913లో మరో లేఖ రాశాడు. దీంతో ప్రభుత్వం ఆయనను 1921లో పూణెలోని యర్వాడ జైలుకు మార్చింది. ఆ తరవాత రకరకాల కారణాలతో ప్రభుత్వం సావర్కర్‌ను 1924లో కొన్ని షరతులతో విడుదల చేసింది. అయితే ఆయన బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తనవంతుగా పోరాటం చేసిన మాట మాత్రం వాస్తవం. ఈ అంశాన్ని తాజాగా రాజేయడం ద్వారా బిజెపి లబ్ది పొందిందనే చెప్పాలి.

ఆర్టీసీ సమ్మెపై నిరంకుశ వైఖరి

రోజురోజుకూ పెరుగుతున్న ప్రజా మద్దతు
కార్మికులను దోషులుగా చేసే యత్నం విఫలం

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మె సకలజనుల సమ్మెగా మారుతున్నా సర్కార్‌లో చలనంకానరావడం లేదు. ఇప్పుడు బస్సులు లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నా, ప్రజలంతా సర్కార్‌ను నిందిస్తున్నారే తప్ప ఆర్టీసీ కార్మికులను తప్పుపట్టడం లేదు. కెసిఆర్ దుర్మార్గంగా ఆలోచన చేస్తూ ఆర్టీసీ ఆస్తులను కాజేసే పనిలో ఉన్నారన్న ప్రచారం బాగా సాగుతోంది. అయితే ఇంతగా ఉద్యమం సాగుతున్నా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయడం లేదు. కార్మికులు కుటుంబాలతో రోడ్డున పడ్డా వారికి జీతాలు చెల్లించాలన్న పెద్ద మనసును చాటుకోలేదు. సరికదా వారిని మరింతగా అణచివేయాలన్న పథకాలతో ముందుకు వస్తోంది. జీతాలుచెల్లించడానికి డబ్బులు లేవంటూ నిస్సిగ్గుగా మైకోర్టుకు తెలిపింది.

అక్టోబర్ 5వ తేదీ నుండి తెలంగాణ ఆర్టీసీ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. దీంతో ప్రజలు కూడా కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. రాజకీయ పార్టీలు కూడా మూకుమ్మడిగా మద్దతు తెలిపారు. రెండు నెలల నుండే సంస్థ రక్షణ, వేతన ఒప్పందం, సర్వీసు కండీషన్లు ఉద్యోగ భద్రత డిమాండ్లతో తెలంగాణ ఎన్‌డబ్ల్యుఎఫ్ విస్తృత ప్రచారం చేసింది. నాలుగు సంఘాలతో ఎన్‌డబ్ల్యుఎఫ్, టిఎంయు, ఇయు, సూపర్‌వైజర్లు అసోసియేషన్లతో జెఎసి ఏర్పడింది. మిగిలిన సంఘాలతో మరొక జెఎసి అని ప్రకటించినా, నాలుగు సంఘాల ప్రధాన జెఎసితోనే సమ్మె ప్రకటన తరువాత కలసి వచ్చాయి.

అక్టోబర్ 5వ తేదీకి రెండు రోజుల మందు ముగ్గురు ఐఎఎస్ అధికారులతో కమిటీ వేసి, సమ్మె వంటి ప్రధాన సమస్యను ఈ కమిటీ రెండు నెలల్లో పరిష్కరిస్తుందని పేర్కొన్నది. ఎప్పటిలాగే ఆ కమిటీ తెలంగాణ కార్మికుల సమ్మెను వాయిదా వేసుకోమని తెలిపింది. వెనక్కి తగ్గరాదని, సమ్మెను వాయిదా వేయరాదని జెఎసి నిర్ణయించింది.

సమ్మె ప్రారంభమైనా తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి సమ్మెను చర్చల ద్వారా పరిష్కారం చేయకుండా ప్రైవేటీకరణ అజెండాను అమలు చేయాలనే అతి ఉత్సాహంతో ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాలే లేవన్నారు. సమ్మెలో వున్న కార్మికులంతా సెల్ఫ్ డిస్మిస్ అయ్యారని ప్రకటించారు. నిజంగా ఇది ఓ అరచాక ప్రకటన తప్ప మరోటి కాదు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు పెరిగిపోతున్నా, డ్రైవర్లు స్టీరింగులపై గుండెపోటుతో ఒరిగిపోతున్నా, అకాల మరణాలు పెరిగిపోతున్నా కెసిఆర్ ప్రభుత్వం, టిఎస్ ఆర్టీసీ యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నాయి. 50 శాతం ఆర్టీసీ, 50 శాతం ప్రైవేటు అంటూ ప్రైవేటీకరణను బాహాటంగా ప్రకటించారు. తన వ్యూహం మేరకు ఆర్టీసీని తన అనుయాయులకు అప్పగించే పనిలో చాపకిందనీరులా కెసిఆర్ పనులు సాగిస్తున్నారు. అద్దె బస్సులు 30 శాతం, ప్రైవేటు బస్సులను 20 శాతం స్టేజి క్యారియర్‌గా అనుమతించి నడిపితే అప్పుడు పోటీ పెరిగి ఆర్టీసీ లాభాల్లోకి వస్తుందనే వింత భాష్యాలు చెప్పారు. మెగా కృష్ణారెడ్డి, జూపల్లి రామేశ్వరరావు వంటి వారికి విద్యుత్ బస్సుల కాంట్రాక్టర్లతో కలిపి, బస్సు రూట్లను దఖలు చేయడానికి కెసిఆర్ ప్రభుత్వం చర్చించిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వం కిమ్మనడం లేదు. సమ్మె విచ్ఛిన్న కార్యక్రమాలు ముమ్మరం చేసి, ఆర్టీసీ కార్మిక సంఘాలను తూలనాడింది. ఉద్యోగ సంఘాల నాయకులను కార్మికుల నాయకులను పిలిచి, ఆర్టీసీ కార్మిక సమ్మెకు మద్దతు ఇవ్వకుండా ఆపాలని ప్రయత్నించి, చివరకు భంగపడింది. తాత్కాలిక సిబ్బందిని నియమించి ముందుకు సాగాలన్న కుట్రలకు తెరతీసింది. హైకోర్టు చర్చలుచేయాలని సూచించినా బేఖాతరు చేసింది.

గతేడాది 16 శాతం తాత్కాలిక భృతిని కార్మికులకు ఇచ్చారు. తాత్కాలిక భృతి ఇచ్చిన రెండు మూడు నెలల్లో కనీసం ఆరు నెలల్లో వేతన ఒప్పందం పూర్తి చేసుకోవాలి. కానీ తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం కార్మికులతో, కార్మిక సంఘాలతో ఏడాది కాలంగా చర్చించలేదు. తెలంగాణ ప్రజలకు ఈ సమ్మె ద్వారా ప్రభుత్వమే దోషి అని తేలింది. మూడు దఫాలుగా ఇచ్చిన కోర్టు తీర్పులు కూడా ప్రభుత్వ కపటవాదనలను, దుర్మార్గాన్ని ఎత్తి చూపాయి. సమ్మెను చర్చల ద్వారా పరిష్కరించకుండా, అనుభవం లేని పోటీ కార్మికులతో బస్సులను నడిపే చర్యలు వాటితో జరిగిన ప్రమాదాలు, దుర్ఘటనలు, సమ్మె పరిష్కారం కోసం డ్రైవర్ శ్రీనివాసరెడ్డి, కండక్టర్ సురేందర్‌గౌడ్ ఆత్మబలిదానాలు కసాయి ప్రభుత్వాన్ని కదిలించలేక పోయాయి. జెఎసి పిలుపుపై అక్టోబరు 19న రాష్ట్ర బంద్ విజయవంతమైంది. రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, విస్తార ప్రజానీకం సంఘీభావం తెలిపారు.సమ్మెలో ఉన్న కార్మికులకు టిఆర్ఎస్ తప్ప అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయి. విద్యార్థి, యువజన, రైతు, వ్యవసాయ కార్మికసంఘాలు, లాయర్లు, ఉపాధ్యాయ సంఘాలు, సమ్మెను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆర్టీసీని ప్రైవేటీకరించవద్దని ఉద్యమిస్తున్నాయి. కెసిఆర్ ప్రభుత్వంపై అన్ని విధాల ఒత్తిడి పెరుగుతోంది.

మేలురకం ఆవుల పంపిణీతో ఉపాధి

జిల్లాలో ఐటిడిఎ ఆధ్వర్యంలో పంపిణీ

ఆదిలాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): జిల్లాలో పాడి పరిశ్రమాభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆవుల పెంపకంతో పేదలు ఉపాధి పొందేలా చర్యలు చేపట్టారు. మేలు రకమైన ఫీజ్‌వాల్ జాతి ఆవులు రోజుకు 10 లీటర్ల పాలు ఇస్తాయని, పాల అమ్మకంతో పేదల ఉపాధి మెరుగు పడుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని ఐదు కొలాం గిరిజన కుంటుంబాలతో పాటు ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు 257 అవులు, దూడలను పంపిణీ చేశారు. ఉట్నూర్ ఐటీడీఏ నుంచి కొలాం గిరిజనులకు ఉచితంగా ఆవులను పంపిణీ చేశారు. కర్ణాటకలోని బెల్గాంలో మిలటరీ డెయిరీకి చెందిన మేలురకమైన ఫీజ్‌వాల్ జాతి ఆవులతో పేద కుటుంబాల్లో ఉపాధి మెరుగుపడుతుందని అధికారులు అంటున్నారు. ఆవులు పంపిణీ చేసిన గ్రామాల్లో మేత పెంచేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఆవుల పెంపకం ద్వారా పేదలకు, రైతు కుటుంబాలకు ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కర్ణాటకలోని బెల్గాం ఉన్న మిలటరీ డెయిరీని మూసివేస్తుండగా ఈ విషయాన్ని తెలుసుకున్న డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి విజయ డెయిరీ అధికారులను కర్ణాటకకు పంపించి వాటిని జిల్లాలోని రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ అధికారులను సంప్రదించి పేదలకు ఆవులను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఒక్కో ఆవును లక్ష చొప్పున కొనుగోలు చేయగా రవాణా ఇతర ఖర్చులకు రూ.10 వేల వరకు వెచ్చించారు. జిల్లాలోని ఐదు కొలాం గిరిజన గ్రామాలతో పాటు మరో 15 గ్రామాల్లోని ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు, పేదలకు ఆవులను పంపిణీ చేశారు. జైనథ్ మండలం జున్నిపాని, తలమడుగు మండలం సకినాపూర్, మావల మండలం వాహూపూర్, ఉట్నూర్ మండలం రాంగూడ, కొలాంగూడ గ్రామాల గిరిజనులకు వాటిని పంపిణీ చేశారు. వీటితో పాటు రైతు ఆత్మహత్య చేసుకున్న 15 గ్రామాల కుటుంబాలకు ప్రజావాణిలో తమకు ఉపాధి కల్పించాలంటూ దరఖాస్తు చేసుకున్న మరి కొందరు పేదలకు ఆవులను పంపిణీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న ఆర్టీసీ సమ్మె

రాజకీయ పార్టీల తోడ్పాటుతో మరింత వేడి

నిజామాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మెతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రాజకీయం వేడెక్కింది. రాజకీయపార్టీల నేతలు పోటాపోటీగా ఇప్పుడు ధర్నాలు,ఆందోళనతో ఉద్యమాన్ని వేడెక్కిస్తున్నారు. అలాగే పలు విద్యార్థి సంఘాలు,ప్రజా సంఘాలు కూడా ఇందులో పాల్గొనడంతో ఆర్టీసీ సమ్మె సకలజనుల సమ్మెగా మారింది. ముఖ్యంగా కార్మికుల సమ్మెపై స్పందించడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగడుతున్నాయి. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారితో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశాయి. వారం రోజులుగా కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, టీడీపీ న

రవిదాస్ గుడి నిర్మాణానికి ముందుకొచ్చిన కేంద్రం

-సుప్రీం కోర్టు అనుమతి

న్యూఢిల్లీ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): సంత్ రవిదాస్ గుడిని కూల్చిన చోటే పునర్నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ గుడిని కోర్టు ఆదేశాల మేరకు ఆగస్టులో కూల్చేశారు.దక్షిణ ఢిల్లీలోని తుగ్లకాబాద్‌లో సంత్ రవిదాస్ గుడిని కూల్చే యడం తో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమ య్యాయి. దీంతో శాంతి, సామరస్యా లను కాపాడేందుకు ఈ గుడిని అదే స్థలంలో పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ విషయాన్ని అటార్నీ జనరల్ కే కే వేణుగోపాల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. 400 చదరపు మీటర్ల విస్తీర్ణంగల భూమిని సంత్ రవి దాస్ గుడి కోసం కేటాయిస్తామని తెలిపారు. గుడి నిర్వహణ బాధ్యతలను నిర్వహించేందుకు భక్తులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. సంత్ రవిదాస్ గుడికి 500 ఏళ్ళ చరిత్ర ఉంది. దీనిని తుగ్లకాబాద్ అటవీ భూమిలో నిర్మించారు. ఈ భూమిని ఖాళీ చేయాలని గతంలో కోర్టు గురు రవిదాస్ జయంతి సమారోహ్ సమి తిని ఆదేశించింది. కానీ ఈ ఆదేశాలు అమలు కాలేదు. దీంతో సమితిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది తీవ్రమైన ఉల్లంఘన చర్య అని తెలిపింది. గుడిని కూల్చేయాలని ఆదేశించడంతో ఢిల్లీ అభివృద్ధి సంస్థ (డీడీఏ) ఆగస్టు 10న గుడిని కూల్చే సింది. గుడిని కూల్చేయడంతో పం జాబ్, ఢిల్లీలలోని రాజకీయ పార్టీలు, దళితులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దేశ వ్యాప్త బంద్‌కు కూడా పిలుపునిచ్చారు. దీనికి దేశవ్యాప్తంగా దళిత హక్కుల కోసం పోరాడేవారు మద్దతిచ్చారు.

పక్కాగా మద్యం టెండర్ల ఖరారు

మంత్రిని అభినందించిన ఉద్యోగులు

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఎక్సైజ్ శాఖా మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌కు ఆ శాఖ గెజిటెడ్ అధికారులు అభినందనలు తెలిపారు. 2020-21 మద్యం విధానానికి సంబంధించి ముందస్తు ప్రణాళికలతో గత వారంలో నిర్వహించిన మద్యం టెండర్ల పక్రియను విజయవంతంగా, పారదర్శకంగా నిర్వహించి నందుకు మంత్రిని అధికారులు అభినందించారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు... అబ్కారీ శాఖా మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారు నిర్దేశిరచిన నేపథ్యంలో... రాష్ట్రంలో ఉన్న అబ్కారీ శాఖ ఉద్యోగులు సమర్ధవంతంగా పనిచేశారని ఎక్సైజ్ అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన రాబడిని సాధించిన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, శాఖ స్పెషల్ ప్రత్యేక ప్రధానకార్యదర్శి, కమిషనర్ సోమేష్ కుమార్‌లకు ప్రత్యేకంగా అభినందలు, ధన్యవాదాలు తెలిపారు. ఆబ్కారీ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు టి. రవీందర్ రావు, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏ. సత్యనారాయణ, అబ్కారీ శాఖ ప్రధానకార్యదర్శి అరుణకుమార్, ఏ.శ్రీనివాస్ రెడ్డి, తమటం లక్ష్మణ్ గౌడ్, జి.వెంకటేశం తదితరులు మంత్రిని కలిసిన బృందంలో ఉన్నారు.

హుజూర్‌నగర్‌లో సైదిరెడ్డిదే విజయం: కేటీఆర్

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): హుజుర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విజయం ఖాయమని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇచ్చిన సమాచారం మేరకు సైదిరెడ్డి గెలుపు ఖాయమని తెలుస్తోందని కేటీఆర్ అన్నారు. గత నెల రోజుల నుంచి హుజుర్‌నగర్ ఉప ఎన్నికల్లో కష్టపడి పని చేసిన టీఆర్ఎస్ నాయకులకు, ప్రతి కార్యకర్తకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ సమ్మెపై కేంద్రం మౌనమెందుకు?

- గల్లీలో కొట్లాట.. ఢిల్లీలో దోస్తానాలా బీజేపీ, టీఆర్ఎస్ తీరు
- కేసీఆర్ గురించి కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడటంలేదు
- ఎంఐఎంకు ఆర్టీసీ సమస్యే పట్టదు
- కార్మికులు అధైర్యపడొద్దు.. అండగా కాంగ్రెస్ పార్టీ ఉంది
- కేసీఆర్ ఖబర్దార్.. కాలగర్భంలో కలుస్తావు

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ సమ్మె గురించి గవర్నర్‌తో నివేదిక తెప్పించుకున్న కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. గల్లీలో కొట్లాట, ఢిల్లీలో దోస్తానా అన్న చందంగా బీజేపీతో టీఆర్ఎస్ స్నేహం చేస్తోందని ఆరోపించారు. సెలవులు ఇచ్చి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుకుంటున్న సీఎం కేసీఆర్ గురించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. టీఆర్ఎస్‌తో మ్యాచ్ ఫిక్సింగ్ లేకపోతే వెంటనే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి ఆర్టీసీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల ఐక్యత, ఉద్యమ స్ఫూర్తిని అభినందిస్తున్నానన్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు విభజించి.. పాలించే టీఆర్ఎస్ కుట్రలో చిక్కుకోకుండా ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని.. ఆర్టీసీ కార్మికులు ఎవరు ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తున్న ఎంఐఎం పార్టీకి ఆర్టీసీ సమస్యలు కనబడటం లేదా అని పొన్నం ప్రశ్నించారు. టీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటేనని అందుకే.. సమ్మె గురించి మాట్లాడటం లేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసులను పెట్టి అక్రమ అరెస్టులు చేయించి కార్యకర్తలను, ప్రజలను కేసీఆర్ భయభ్రాంతులకు గురిచేశారన్నారు. కోర్టు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, తెలంగాణ సమాజం ఆర్టీసీ సమస్యను పరిష్కరించాలని కోరినా కేసీఆర్ అహంకారంతో ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. అధికారం శాశ్వతం కాదని, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతే కాలగర్భంలో కలుస్తావు.. ఖబర్దార్ కేసీఆర్ పొన్నం ప్రభాకర్ అని హెచ్చరించారు.

. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో యూత్ వర్క్‌షాపును ప్రారంభించిన గవర్నర్ తమిళ సై. చిత్రంలో మంత్రి నిరంజన్ రెడ్డి, విసి ప్రవీణ్ రావు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం మరో షాక్

జీతాలకు డబ్బులేవని హైకోర్టుకు నివేదన
కార్పొరేషన్ వద్ద 7.49కోట్లు ఉన్నట్లు వెల్లడి
సమ్మెతో 125 కోట్ల నష్టం వాటిల్లినట్లు వివరణ
విచరణను 28కి వాయిదా వేసిన హైకోర్టు
మరోమారు గవర్నర్‌కు పరిస్థితిని వివరించిన జెఎసి

హైదరాబాద్,అక్టోబర్22 (ఆర్ ఎన్ఎ): ఆర్టీసీ కార్మికులకు సెఎం కెసిఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. కార్ఇమకులకు జీతాలుచెల్లించేందుకు నిధులు లేవని, దసరా సందర్భంగా 125కోట్ల నష్టం వాటిల్లిందని హైకోర్టుకు తెలిపింది. సెప్టెంబర్ నెల వేతనాలు ఇవ్వాలనే పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. దీంతో విచారణ తిరిగి ఈనెల 29కి వాయిదా పడింది.ఆర్టీసీ ఇన్‌ఛార్జ్ ఎండీ సునీల్‌శర్మ ఈ కౌంటర్‌ను దాఖలు చేశారు. కార్మికుల జీతాలు చెల్లిం చేందుకు రూ.239కోట్లు అవసరం కాగా.. కార్పొరేషన్ వద్ద రూ.7.49 కోట్లే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కార్మికులకు 67 శాతం వేతనాలు పెంచామన్నారు. ఏటా రూ.900కోట్ల ఆర్థిక భారంతో 2015 జూన్‌లో 44 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని సునీల్‌శర్మ కౌంటర్‌లో వివరించారు. రూ.200కోట్ల ఆర్థికభా రంతో 2018 జులైలో 16 శాతం మధ్యంతర భృతి ఇచ్చామని పేర్కొ న్నారు. ఆర్టీసీకి రూ.4,882కోట్ల వార్షికాదాయం ఉండగా.. ఖర్చు రూ.5,811కోట్లు అవుతోందని వివరించారు. ప్రతి నెలా జీతాలు ఇచ్చేందుకు ప్రభుత్వంపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు. ఆర్టీసీకి రూ.4,709 కోట్ల అప్పులు ఉండగా.. ఉద్యోగుల పీఎఫ్, ఈఎల్, సీసీఎస్ బకాయిలే రూ.1660 కోట్లు ఉన్నాయని సునీల్‌శర్మ వివరించారు. కార్మికశాఖ వద్ద చర్చల పక్రియ పెండింగ్‌లో ఉండగానే చట్టవిరుద్ధంగా సమ్మెకు వెళ్లారన్నారు. కార్పొరేషన్ బలోపేతానికి చర్యలు చేపడతామని ప్రభుత్వం చెప్పినప్పటికీ సమ్మెకు వెళ్లి కోట్ల మందికి అసౌకర్యం కలిగించారని సునీల్‌శర్మ కౌంటర్‌లో పేర్కొన్నారు. సమ్మెతో దసరా సీజన్‌లోనే రూ.125 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ఆయన చెప్పారు

. ప్రభుత్వం జీతాలు ఇవ్వకు ండా హైకోర్టుకు చెప్తున్న విషయంపై మండిపడ్డ కార్మికులు నష్టాల సాకు చెప్పి ప్రభుత్వం ఆర్టీసీని విచ్ఛిన్నం చేయాలని చూస్తుందని పేర్కొన్నారు. నిధులు లేవని జీతాలు ఇవ్వలేము అని చెప్తున్న ప్రభుత్వం విధుల్లో ఉంటె నిధులు లేకున్నా జీతాలు ఎలా ఇస్తారో అని అశ్వత్థామరెడ్డి ప్రశ్నించారు. కావాలనే కుంటి సాకులు చెప్తున్నారని, ఆరేళ్లుగా లేని సమస్య ఇప్పుడు ఎలా వచ్చిందని, కావాలనే కోర్టుకు ప్రభుత్వం తప్పుడు సమాచారం ఇస్తుందని మండిపడ్డారు. ఇక ఆర్టీసీ కార్మికుల సమ్మె చట్ట విరుద్ధం అని ప్రభుత్వం తరపు అడ్వకేట్ జనరల్ వాదించారు. ఇక పని చేసిన నెల జీతం ఇవ్వకపోవటం చట్ట విరుద్ధం అని పిటీషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు.

ఇక నేడు కోర్టులో ఇరువురి వాదనలు విన్న ధర్మాసనం మరోమారు ఈ కేసు విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసింది. దీంతో నేడు కోర్టు ఆదేశాల మేరకు కార్మికుల ఖాతాల్లో పడతాయనుకున్న జీతం డబ్బులు పడలేదు. దీంతో కార్మిక కుటుంబాలు నిరాశ చెందుతున్నాయి. కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంపై చిక్కుడు ప్రభాకర్ హైకోర్టులో పిటిషన్ వేశారు.

గవర్నర్‌కు మరోమారు వినతి

గవర్నర్ తమిళిసైతో ఆర్టీసీ జేఏసీ నేతల సమావేశమయ్యారు. ఆర్టీసీ సమ్మె విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైకోర్టు వ్యాఖ్యలు, వేతనాలు లేక కార్మికులు పడుతున్న ఇబ్బందులను గవర్నర్ తమిళిసైకి ఆర్టీసీ జేఏసీ నేతలు వివరించారు. ఇక జేఏసీ నేతల విజ్ఞప్తిపై గవర్నర్ తమిళిసై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా రెండు వారాలుగా తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేపట్టారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో గవర్నర్‌ని కలిసి సమస్యలు పరిష్కరిం చాలని కోరారు.

విహెచ్‌పి నేతల భేటీ

గవర్నర్ తమిళిసైని వీహెచ్‌పీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో వీహెచ్‌పీ కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించామని ఆపార్టీ నేత రామరాజు చెప్పారు. ఆర్టీసీ సమ్మెపై పువ్వాడ అజయ్‌తో, కార్మికసంఘాల నాయకులతో మాట్లాడామన్నారు. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చొరవచూపి కార్మికులను త్వరగా చర్చలకు పిలవాలని ఆయన కోరారు. కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దని పోరాడి తమ డిమాండ్లను సాధిం చుకో వాలన్నారు.

కరీంనగర్‌లో డ్రైవర్ ఆత్మహత్యా యత్నం

తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 17వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో కరీంనగర్ 1వ డిపో ఎదుట జంపన్న అనే ఆర్టీసీ డ్రైవర్ వంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన పోలీసులు అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించడం, మరోవైపు జీతాలు లేక భవిష్యత్తుపై బెంగతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం.

ఆర్టీసీ సమ్మెతో ఆత్మరక్షణలో సిఎం కెసిఆర్

కేసీఆర్ రక్షణ కవచం బలహీనపడింది
ధర్మం, దైవం, సమాజం కార్మికుల వైపు ఉన్నాయి
సకల జనుల సమాజ మద్దతుతో ఉద్యమానికి శక్తి పెరిగింది
ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

భద్రాచలం,అక్టోబర్22 (ఆ ర్ఎన్ఎ): న్యాయమైన డిమాండ్లతో సమ్మె ప్రారంభించిన ఆర్టీసీ కార్మికులకు సకల సమాజం వెన్నంటి ఉండటంతో అటు ప్రభుత్వం, ఇటు పార్టీలో కేసీఆర్ ఒంటరి వారయ్యారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్‌పై ప్రతిపక్షాలు ఎవరైనా విమర్శలు చేస్తే రక్షణ కవచంగా నిలబడే హరీష్‌రావు, కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ మౌనంగా ఉండటమే ఇందుకు నిదర్శనమన్నారు. దీంతో తొలి నుంచి ప్రధాన రక్షణ కవచంగా ఉన్నవారి మౌనంతో నేడు బలహీనపడినట్లు అయ్యిందని పేర్కొ న్నారు. భద్రాచలంలో సోమవారం ఆర్టీసీ కార్మికుల సమ్మె శిబిరానికి వచ్చి ఆయన ప్రసంగించారు. రాష్ట్ర మంత్రి వర్గ, పార్టీ సమావేశాలు నిర్వహిస్తే మంత్రులు, పార్టీ నాయకుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతాయనే భావనతో వాటిని సైతం నిర్వహించలేని స్థితిలో సీఎం కేసీఆర్ ఉన్నారని ఆరోపించారు. కార్మికుల సమ్మె దెబ్బతో కేసీఆర్ పూర్తిగా బలహీనపడ్డారని, నిద్రపట్టని పరిస్థితి నెలకొందన్నారు. మరోరకంగా చెప్పాలంటే ఆర్టీసీ దెబ్బతో కేసీఆర్ ప్రభుత్వం అతలాకుతలం అవుతోందన్నారు. ఆర్టీసీ సమ్మె ప్రారంభానికి ముందే కార్మికులకు తొలుత మద్దతు తెలిపింది కేవలం ఎమ్మార్పీఎస్సే అన్న విషయాన్ని విస్మరించరాదన్నారు. దసర పండుగ సమయంలో కార్మికులు సమ్మెబాట పట్టడంతో 50 వేల మంది ఉద్యోగులను డిస్మిస్ చేస్తే యావత్ తెలంగాణ సమాజం తన వెన్నంటి ఉంటుందని భావించిన సీఎం కేసీఆర్‌కు సీన్ రివర్స్ అయ్యిందన్నారు. ఒక్క నోటి మాటతో 50 వేల మందిని డిస్మిస్ చేయడం కేసీఆర్ దురంహకారానికి నిదర్శనమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం సకల జనుల సమ్మె సమయంలో ఏనాడు డిస్మిస్ పదాన్ని ప్రస్తావించలేదని ఆయన గుర్తుచేశారు. కాని ఆర్టీసీ కార్మికులపై డిస్మిస్ అస్త్రాన్ని సమ్మె ప్రారంభానికి ముందే ప్రయోగించి కేసీఆర్ బోన్లో పడ్డారని అన్నారు. తెలంగాణ సమాజం నియంతృత్వాన్ని ఎంత మాత్రం సహించదని, నిజాంనే పారదోలిన గడ్డ తెలంగాణ అని.. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయ పక్షాలు, వివిధ ప్రజా ఉద్యోగ, దళిత సంఘాలు ఒకరి వెంట ఒకరు ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా తరలిరావడంతో 19న రాష్ట్ర బంద్‌తో కేసీఆర్ ఒంటరి వారయ్యారన్న విషయం స్పష్టమైందన్నారు. ఇందుకు కారణం యావత్ తెలంగాణ సమాజం ఆర్టీసీ కార్మికుల పక్షాన నిలిచిందని పేర్కొన్నారు. ధర్మం, దైవం, సమాజం నీవైపే ఉందని అపజయానికి కేసీఆర్ చేరువ కాగా ఆర్టీసీ కార్మికులు విజయానికి దగ్గరలో ఉన్నారని అన్నారు. సకల జనుల సమాజమే ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా నిలవడంతో ఉద్యమానికి శక్తి పెరిగిందన్నారు. తీవ్ర ఆర్థిక లోటుతో పాటు కీలక నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా.. మోయలేని భారమని తెలిసినా.. ఏపీ ప్రభుత్వం నష్టాల్లో ఉన్న ఆర్టీసీని విలీనం చేసిందని మందకృష్ణ మాదిగ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. దేశంలోనే మిగులు బ్జడెట్ రాష్ట్రంగా తెలంగాణను సీఎం కేసీఆరే పేర్కొన్న క్రమంలో కేవలం రూ.3 వేల కోట్ల నష్టంతో ఉన్న టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో ఎందుకు విలీనం చేయకూడదని ఆయన ప్రశ్నించారు. రూ.1200 కోట్లు పన్నుల రూపేణా ప్రభుత్వమే పిండుతోందని దుయ్యబట్టారు. ఆర్టీసీ సంస్థకు రూ.3 వేల కోట్ల నష్టంలో రూ.2 వేల కోట్లు ప్రభుత్వమే చెల్లించాల్సి ఉందని ఆయన వివరించారు. అక్రమ రవాణాకు చెక్‌పెడితే రూ.1000 కోట్లు జమ అవుతాయని సూచించారు. న్యాయమైన డిమాండ్లతో ఆర్టీసీ కార్మికులు సమ్మెలోకి వెళ్తే వారితో చర్చలు జరపాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య, అహంకార పూరిత ధోరణితో వ్యవహ రిస్తోందని ధ్వజమెత్తారు. ఒకానొక సందర్భంలో కేసీఆర్.. కెనడా పాలసీని సైతం అమలు చేయాలని సంకల్పించారని గుర్తుచేశారు. అయితే, తానొకటి తలిస్తే.. దైవమొకటి తలచిన చందంగా ఆ ప్రయత్నం విఫలమైందన్నారు. ఫిలిప్పైన్స్‌లో ఏ విధంగా ప్రజలు రాజరికపు వ్యవస్థలో ఉన్న రాజును గద్దె దింపారో అదే పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో పునరావృతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్మిక కుటుంబాలు పాల్గొన్నాయి.

దేశ ఆర్థిక వ్యవస్థలో

వ్యవసాయానిదే కీలకపాత్ర

- కేంద్ర, రాష్ట్రాలు వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తున్నాయి
- యువతను వ్యవసాయరంగంవైపు ప్రోత్సహించాలి
- వ్యవసాయ మంత్రి రైతుకావటం ఆనందంగా ఉంది
- తన వ్యవసాయక్షేత్రాన్ని, జోగులాంబ ఆలయాన్ని త్వరలోనే సందర్శిస్తా
- వేరుశనగ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు మంత్రి కృషి అభినందనీయం

- గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

హైదరాబాద్, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానిదే కీలక పాత్ర అని, యువత దృష్టి వ్యవసాయ రంగంవైపు మరల్చేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాల యంలో రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్, ఉన్నతాధికారులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. మంత్రి స్వయంగా రైతు కావడం ఆనందంగా ఉందని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ వ్యాఖ్య నించారు. మంత్రి వ్యవసాయ క్షేత్రాన్ని, జోగులాంబ ఆలయాన్ని త్వరలోనే సందర్శిస్తానని గవర్నర్ ఈ సందర్భంగా తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయ మంత్రి మామిడి పండ్లను యూరోప్ దేశాలకు ఎగుమతి చేయడం రైతులకు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. పాలమూరు జిల్లాలో వేరుశెనగ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు సంబంధించి మంత్రి నిరంజన్ రెడ్డి కృషిని అభినంది స్తున్నానన్నారు. యువత వ్యవసాయ రంగం వైపు చూపు మరల్చేలా ప్రోత్సహించాలని గవర్నర్ ఈ సందర్భంగా కోరారు. వ్యవసాయం లాభదాయకం అయితేనే వారు ఇటువైపు అడుగులు వేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసా యానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నా యన్నారు. దేశ ఆర్థిక రంగంలో వ్యవసాయానిదే కీలక పాత్ర అని వెల్లడించారు. జనాభాలో 54.6 శాతం మంది వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నిమగ్నమై ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 60 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని గవర్నర్ తమిళిసై ఈ సందర్భంగా పేర్కొన్నారు. వ్యవసా యాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రుణ మాఫీ, వ్యవసాయ యాంత్రీకరణ, సబ్సిడీ విత్తనాలు, సూక్ష్మ సేద్యం, వ్యవసాయ ప్రయోజనాల కోసం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా. రైతుబంధు, రైతు బీమా వంటి అనేక సహాయ కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందన్నారు. మిషన్ కాకతీయతో చెరువులను పునర్నిర్మించి చిన్ననీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించడం జరిగిందని తమిళిసై వెల్లడించారు. ప్రతి మండలానికి ఒక వ్యవసాయాధికారిని, ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణాధికారిని నియమించి రైతులకు సేవలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం పంట కాలనీలను ప్రోత్సహిస్తోందన్నారు. అయితే వ్యవసాయం వైపు యువత ఆసక్తి క్షీణిస్తుండడం విచారకరమన్నారు. వ్యవసాయ రంగ శ్రేయస్సు కోసం యువత సహకారం తప్పనిసరి అని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం వైపు యువతను ఆకర్షించడం ఇప్పుడు ప్రధానమయిన అంశమని స్పష్టం చేశారు. వ్యవసాయంతోపాటు పాడి వ్యవసాయం, తేనెటీగ సంస్కృతి, పుట్టగొడుగుల సాగు, సెరికల్చర్, చేపల పెంపకం వంటి వ్యవసాయానికి సంబంధి ంచిన రంగాలను ప్రోత్సహించడం ద్వారా యువతను ఈ రంగం వైపు ఆకర్షించగలుగుతామని పేర్కొన్నారు. వ్యవసాయాధారిత ఉత్పాదక యూనిట్లను, వనరుల లభ్యతను తెలుసుకునేందుకు పంచాయతీ స్థాయిలో గ్రామీణ యువతకు శిక్షణనివ్వాల్సిన అవసరముందని గవర్నర్ పేర్కొన్నారు. వ్యవసాయం లాభసాటి అని భావిస్తే గ్రామీణ యువత దీనిని వృత్తిగా స్వీకరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వివిధ విజయవంతమైన వ్యవసాయ సంబంధిత క్షేత్రాలను యువతకు పరిచయం చేయడం, వర్క్‌షాపులు నిర్వహించడం ద్వారా యువతను వ్యవసాయం వైపు ప్రేరేపించాలని సూచించారు. అనంతరం మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానిది కీలకపాత్ర. ఇక్కడి జనాభాలో 54.6శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో ఉన్నారు. రాష్ట్రం జనాభాలో 60శాతం గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వ్యవసాయరంగాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టింది. రైతు బంధు, రైతుబీమా పథకాలతో పాటు సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నాం. మిషన్ కాకతీయతో చెరువులను పునర్నిర్మించి చిన్ననీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరించడం జరిగింది. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి చేయూతనిచ్చేందుకు పంటకాలనీలు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

తెదేపాకు పూర్వవైభవం తెస్తాం

- పార్టీలో యువతకు 33శాతం, మహిళలకు 33శాతం పదవులు కేటాయిస్తాం
- నాయకులు వెళ్లినంతమాత్రాన టీడీపీకి నష్టమేమీలేదు
- ఒక నాయకుడు పోతే వంద మంది నేతలు పుడతారు
- పోలీసులు జగన్ సర్కార్ శాశ్వతం కాదని గ్రహించాలి
- ప్రాణాలు పోతుంటే.. మాది మీడియా షో అటారా?
- నేను తప్పు చేయలేదు.. భయపడను
- ప్రజావేదిక కూల్చివేతతోనే వైసీపీ ప్రభుత్వ పతనం ప్రారంభమైంది
- వైసీపీ నవరత్నాలు నవగ్రహాలుగా మారిపోయాయి
- ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేయటానికి మీ అబ్బ సొత్తా?
- పులివెందుల రాజకీయాలు చేస్తే.. ఖబర్దార్ జగన్

- ఏపీ ప్రతిపక్షనేత, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

శ్రీకాకుళం, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో తెపాకు మళ్లీ పూర్వవైభవం తెస్తామని, నాయకులు పోయినంతమాత్రాన పార్టీకొచ్చే నష్టమేమీలేదని, ఒక్కరు పోతే వందమంది నాయకులు తయారవుతారని ఏపీ ప్రతిపక్ష నేత, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం చంద్రబాబు శ్రీకాకుళం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు.. నేను ఎలాంటి తప్పు చేయలేదని, ఎవరికీ భయపడనని చంద్రబాబు అన్నారు. జగన్ తండ్రి 26 కేసులు వేశారని, ఏం సాధించారని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తెస్తానని, గ్రామ స్థాయి నుంచి సమర్ధవంతమైన నాయకత్వం రావాలన్నారు. కార్యకర్తల త్యాగాలు మరిచిపోలేనని.. కార్యకర్తల ప్రాణాలకు తన ప్రాణం పణంగా పెడతానని చంద్రబాబు అన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారు దేశభక్తులయ్యారని, ప్రజాస్వామ్యం కోసం పోరాడి ప్రజల ఆశీస్సులు పొందండని అన్నారు. పార్టీలో యువతకు 33శాతం పదవులు ఇస్తామని, మహిళలకు 33 శాతం కేటాయిస్తామన్నారు. ప్రజల కోసం నిరంతరం ఆలోచించానని, కార్యకర్తలతో ఎక్కువ సమయం గడప

త్వరగా మిషన్ భగీరథ పూర్తి కావాలి

ఇంటింటికీ నీరు అందించే లక్ష్యాన్ని పూర్తి చేయాలి
-అధికారులతో సమీక్షలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

మంచిర్యాల,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): మిషన్ భగీరథ పనులు ఇప్పటికే సగానికి పైగా పూర్తయినప్పటికీ, మిగిలిన పనులు

త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ నల్లా ద్వారా నీరు అందించాలన్న సిఎం కెసిఆర్ లక్ష్యాన్ని ముందుకు తీసుకుని వెళ్లాలన్నారు. జిల్లాలోని నస్పూర్ సింగరేణి గెస్ట్‌హౌస్‌లో మిషన్ భగీరథ, 30 రోజుల గ్రామ ప్రణాళికపై మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 30 రోజుల గ్రామ ప్రణాళిక పనులకు సంబంధించి మంత్రి అధికారుల నుంచి సమాచారం సేకరించారు. గ్రామాల్లో ఏ మేరకు అభివృద్ధి పనులు జరిగాయో వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రికి సమాధానమిస్తూ.. గ్రామాల్లో 30 రోజుల ప్రణాళికలో భాగంగా చాలా అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ఊర్లల్లో పారిశుద్ధ్య పనులు, శిథిలమైన గృహాలను కూల్చి వేసినట్లు వారు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ పెద్ద ఎత్తున మొక్కలు నాటినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్యేలు దివాకర్ రావు, చిన్నయ్య, కోనేరు కోనప్ప, ఎమ్మెల్సీ పురాణం సతీష్, మంచిర్యాల కలెక్టర్ భారతి హోలీ కేరి, ఆసిఫాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, జెడ్పీ చైర్‌పర్సన్స్ భాగ్యలక్ష్మి, కోవలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేయడానికి వచ్చి ఘాతుకం

కానిస్టేబుల్ వేలు కొరికిన దుండగుడు

ఖమ్మం,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఖమ్మం వన్ టౌన్ కానిస్టేబుల్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. వన్ టౌన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మసూద్ అలీ రాత్రి స్టేషన్ డ్యూటీ నిర్వహిస్తుండగా అర్ధరాత్రి కంప్లైంట్ చెయ్యటానికి ఓ వ్యక్తి వచ్చాడు. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసి, తొడ కందరాలు, చేతి వేళ్లను కొరకడంతో కానిస్టేబుల్ చిటికెన వేలు తెగి కిందపడింది. విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు విషయాన్ని బయటకు రాకుండా గోప్యంగా ఉంచారు. అతడకి చికిత్స అందిస్తున్నారు.

జలకళతో ఆకట్టుకుంటున్న శ్రీరాంసాగర్

-ప్రమాదాలు జరక్కుండా చూడాలన్న కలెక్టర్

నిజామాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎంఆర్ఎం రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు నిండడంతో పర్యాటకులు భారీగా తరలి రావడానికి ఉత్సాహం చూపుతారని అన్నారు. దీంతో నీటిలోకి కూడా వెళ్లడానికి ప్రయత్నం చేస్తారని తద్వారా ప్రమాదాలకు అవకాశం ఉంటుందని అన్నారు. దీంతో అప్రమత్తంగా ఉండడం ద్వారానే ప్రమాదాలు నివారించడానికి వీలవుతుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పిల్లల విషయంలో వెంట ఉండి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. గేట్లు వదిలినప్పుడు పారే నీటిలో సాహసాలకు వెళ్లవద్దని ఆయన యువతకు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ నీటిపారుదల అధికారులు పోలీసు యంత్రాంగం నదీ పరివాహక ప్రాంతంలో, ప్రాజెక్టు చుట్టుపక్కల జాగ్రత్త గా విధులు కేటాయించుకుని నిర్వహించాలని ప్రాజెక్టు ప్రమాదం అంచులకు వెళ్లకుండా నివారించాలని ఆయన తెలిపారు. సెల్ఫీలతో ప్రమాదాలు జరక్కుండా చూడాలన్నారు. అలాగే భద్రతను పెంచాలన్నారు.

ఇంత అణచివేత ఎప్పుడూ లేదు

■ చర్చలు లేవని చెప్పడం నియంతృత్వ ధోరణికి నిదర్శనం
– టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

హైదరాబాద్, అక్టోబర్22(ఆర్ఎన్ఎ) : కేసీఆర్ రాష్ట్రంలో నియంతృత్వ ధోరణితో పాలన సాగిస్తున్నాడని, ఇంత అణచివేత ధోరణి ఎప్పుడూ చూడలేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు.

సోమవారం గాంధీభవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం మొత్తాన్ని జైలులా మార్చారని ఆయన మండిపడ్డారు. ఇంత అణచివేత ధోరణి గతంలో ఎన్నడూ లేదని.. ఇది ప్రజాస్వామ్య పాలన కాదన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై సీఎం కేసీఆర్ నియంతృత్వ ధోరణి వల్లే కాంగ్రెస్ పార్టీ ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిచ్చిందని చెప్పారు. ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన కాంగ్రెస్ నేతల అరెస్టులను ఖండిస్తున్నామని అన్నారు. సమ్మెపై హైకోర్టు చెప్పిన అంశాలను కూడా కేసీఆర్ పట్టించుకోలేదని .. చర్చలు లేవని చెప్పడం ఆయన నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆక్షేపించారు. రాష్ట్రంలో రాజ్యాంగపరమైన పాలన సాగడం లేదని మల్లు రవి ఆరోపించారు. కేసీఆర్ సర్కార్‌పై ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని.. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో దాని ప్రభావం తెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రగతిభవన్ ముట్టడి విషయంలో కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలూ లేవని మల్లు రవి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజ్యాంగపరమైన, చట్టపరమైన పాలన సాగడం లేదని వ్యాఖ్యనిచ్చారు. త్వరలోనే కేసీఆర్ సర్కార్‌పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ కార్మికులతో చర్చించాలని కోర్టు చెప్పినా కేసీఆర్ పట్టించుకోవడం లేదన్నారు. బస్సులు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతుంటే సీఎం కేసీఆర్, రవాణాశాఖ మంత్రి అజయ్‌కు మార్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దని పోరాడి తమ డిమాండ్లు నెరవేర్చుకోవాలన్నారు. కార్మికులను చర్చలకు పిలవాలని ఈ సందర్భంగా మల్లు రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కల్కి ఆశ్రమాల్లో కొనసాగిన దాడులు

మరో 44కోట్ల నగదు స్వాధీనం

చెన్నై,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): కల్కిభగవాన్ దంపతులకు చెందిన ఆశ్రమాలు, వ్యాపార సంస్థలపై వరుసగా సోమవారం కూడా దాడులు జరిగాయి. చెన్నైలోని కల్కి భగవన్‌కు చెందిన వైట్ లోటస్ ప్రాపర్టీలపై సోదాలు జరిగాయి. అక్కడ ఐటీ శాఖ అధికారులు ఇవాళ భారీ స్థాయిలో నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు 44 కోట్ల నగదును సీజ్ చేశారు. అక్కడే సుమారు 20 కోట్ల విలువైన అమెరికా డాలర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో మరో 90 కేజీల బంగారాన్ని కూడా పట్టుకున్నారు. చెన్నైతో పాటు హైదరాబాద్, బెంగుళూరు, చిత్తూరు, కుప్పం ప్రాంతాల్లో ఐటీశాఖ అధికారులు సోదాలు చేశారు. కల్కి భగవాన్ ఆశ్రమం ఐదెకరాల నుంచి ప్రారంభమై వేలాది ఎకరాలకు విస్తరించింది. ఆశ్రమంలో దాదాపు 1500 మందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి ఏటా సిబ్బందికి జీతభత్యాలు చెల్లిస్తూ క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తూ, ఐటీ రిటర్న్ దాఖలు చేస్తున్న కల్కిభగవాన్ గత మూడేండ్లుగా పన్నులు చెల్లించడం లేదని, ఐటీ రిటర్న్స్ కూడా దాఖలు చేయడం లేదని సమాచారం. అలాగే సంస్థలకు ఉన్న కల్కి పేరును కూడా మార్చారు. 'ఏకం'తో పాటు పలురకాల కంపెనీలు, ట్రస్టీల పేర్లతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐటీ అధికారులు కల్కి ఆశ్రమంపై నిఘా పెట్టారు. చెన్నైలోని ప్రధాన కార్యాలయంతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అనుబంధ ఆశ్రమాలు, కార్యాలయాలు, భూముల కొనుగోళ్లు, విరాళాల సేకరణలపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.

పక్కాగా హరితహారం కార్యక్రమం

ఇంటికి ఆరు మొక్కలు పెంచేలా కార్యక్రమం

నల్లగొండ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో అటవీ శాతాన్ని పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం హరితహారం పథకం కోసం ప్రతి ఏటా కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. జిల్లాలో ప్రతి సంవత్సరం 2.2కోట్ల మొక్కలు గడిచిన 4 సంవత్సరాల్లో నాటగా ఈసారి ప్రతి ఇంటిలోను మొక్కలు నాటించాలని సర్కార్ ఆలోచిస్తుంది. అయితే ఈ దఫా ప్రతి ఇంటికి ఆరు మొక్కలను అందజేసి వాటిని రక్షించి పెంచే విధంగా ఆ ఇంటి సభ్యులకే బాధ్యత అప్పగించనున్నారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు అందజేస్తు అందులో వేపతోపాటు దోమల నివారణకు ఉపయోగపడే కృష్ణతులసి ఉండేలా జాగ్రత్తలు చేపడుతూ వచ్చే ఏడాది వీటిని సరఫరా చేయనున్నారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు ఇవ్వాలని సర్కార్‌సూచన మేరకు అధికార యంత్రాంగం ఇటీవల జరిగిన 30రోజుల ప్రణాళికలో పకడ్బందీగా గ్రీన్ఎ÷-లాన్‌ను రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 844 గ్రామ పంచాయతీల్లో ప్రతి ఇంటిని తట్టిన అధికారులు గ్రీన్‌ప్లాన్‌లో భాగంగా వారి అభిప్రాయాలను తీసుకున్నారు. సర్కార్ సూచించిన వేప, కృష్ణతులసితో పాటు మరో 4 పండ్ల మొక్కలను ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిన్తు దానికి అనుగుణంగా ఆ ఇంటి సభ్యులకు ఇష్టమైన 4 మొక్కల జాబితాను రికార్డుల్లో రాశారు. పండ్ల మొక్కల్లో జామ, మామిడి, దానిమ్మ, సీతాఫల్, నేరేడు, నిమ్మ లాంటి మొక్కలు కావాలని ఈ సర్వేలో వెల్లడించారు. ఇళ్లతో పాటు పొలాల దగ్గర పెట్టుకోవడానికి రైతులకు, వీధుల్లోను మొక్కలు నాటుకోవడానికి ఇవ్వనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అటవీశాతం తక్కువగా ఉండి వర్షాభావ పరిస్థితులు నెలకొంటుండడంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. అందులో భాగంగానే జిల్లాకు గడిచిన నాలుగేళ్లుగా 2.2కోట్ల మొక్కల చొప్పున కేటాయించి వాటిని పెంచడంతోపాటు పలు శాఖల ఆధ్వర్యంలో మొక్కల నాటించారు. జాతీయ రహదారులతోపాటు రాష్ట్ర, గ్రామీణ రహదారులపైన మొక్కలు నాటిన నేపథ్యంలో ప్రతి ఇంటింటికీ మొక్కలు నాటించాలని సర్కార్ యోచిస్తోంది. అందులో భాగంగానే ఏ గ్రామానికి ఎన్ని మొక్కలు కావాలనే దానిపై ప్రత్యేక ప్రణాళికలు 30రోజుల కార్యక్రమంలో రూపుదిద్దుకున్నాయి. దీనికి అనుగుణంగా గుర్తించిన నర్సరీల్లో మొక్కలు పెంచి 2020-21 సంవత్సరంలో ఇంటింటికి సరఫరా చేయనున్నారు.

జిల్లాలోని 844 గ్రామ పంచాయతీల్లో ఇంటికి ఆరు మొక్కల చొప్పున ఇవ్వడంతో పాటు రైతులకు, వీధుల్లోను నాటుకోవడానికి మొత్తం 73.45 లక్షల మొక్కలు అవసరమవుతాయని ప్రత్యేక కార్యాచరణలో చేపట్టిన సర్వేలో లెక్కతేలింది. ఇందులో ఇళ్లలో పెట్టుకోవడానికి 28.80 లక్షల మొక్కలు రైతులు పొలాల వద్ద నాటుకోవడానికి 19.78 లక్షలు, గ్రామ వీధుల్లో, ఇంటి ముం దర నాటుకోవడానికి మరో 23.57 లక్షలు ఇవ్వనున్నారు. ఇంతేగాక ప్రతి సంవత్సరం గ్రామ పంచాయతీ నిధుల్లో 10 శాతం హరితహారం మొక్కల పెంపకానికి, అవసరమైన పండ్లు లేదా ఇతర చెట్లు కొనుగోలుకు, ట్రీగార్డులు కొనుగోలు చేయడానికి వినియోగించుకోవచ్చు.

గ్రామాల అభివృద్ధికి మహర్దశ

నిధుల విడుదలతో ప్రత్యేక కార్యక్రమాలు
ప్రణాళికలు సిద్ధంచేస్తున్న పంచాయితీ అధికారులు

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): పంచాయతీ రాజ్ సంస్థలకు నిర్దిష్టమైన విధులను, బాధ్యతలను నిర్దేశిస్తూ కావాల్సిన నిధులను క్రమం తప్పకుండా ప్రభుత్వం సమకూరుస్తుందని సీఎం కెసిఆర్ ప్రకటించిన మేరకు నిధులు విడుదల కాబోతున్నాయి. దీంతో గ్రామాలకు నిధుల కొరతరాదని పంచాయితీ అధికారులు భావిస్తున్నారు. ఈ నిధులతో పంచాయతీల దశ మారనున్నదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే 30 రోజుల ప్రణాళికతో సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటంతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. కేంద్ర ఆర్థిక సంఘం తెలంగాణలోని గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.1229 కోట్లను కేటాయించింది. కేంద్రం నిధులతో సరిసమానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా మరో రూ.1229 కోట్లను కేటాయిస్తుంది. అంటే గ్రామీణ స్థానిక పరిపాలన సంస్థకు ఏటా మొత్తం రూ.2458 కోట్ల చొప్పున నిధులు అందనున్నాయి. ప్రతి సంవత్సరం 500ల జనాభా కలిగిన పంచాయతీకి రూ.8లక్షల అభివృద్ధి నిధులను అందజేస్తామని సీఎం ప్రకటించారు. ఇప్పటికే గ్రామాలాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పిన సీఎం కేసీఆర్ ఆ దిశగా పంచాయతీలకు నిధుల కేటాయించారు. స్థానిక సంస్థల పనితీరును పునర్విభజిస్తూ నూతన పంచాయతీ రాజ్ చట్టానికి రూపకల్పన చేశామన్నారు. ఈ చట్టం వెలుగులో 500 జనాభా కలిగిన చిన్న గ్రామపంచాయతీకి కూడా ఏడాదికి రూ.8 లక్షల అభివృద్ధి నిధులు అందనున్నాయి. వీటికి తోడుగా గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కూడా స్థానిక సంస్థలకు అందుబాటులో ఉండనున్నాయి. ఇప్పుడు సర్పంచ్, ఉప సర్పంచులకు చెక్ పవర్ ఇవ్వడంతో పంచాయతీల్లో పాలకవర్గం సభ్యులు పలు రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. వాటికి తోడు ప్రత్యేక ప్రణాళిక పేరుతో ప్రతినెలా నిధులు రానుండటంతో పనులను కొనసాగించనున్నారు. ప్రధానంగా గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాలు, మురుగు కాలువలు, రహదారులు, సిబ్బంది వేతనాలు, విద్యుత్, మొక్కల పెంపకం, డంపింగ్‌యార్డు నిర్వహణ తదితర వాటిపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. భవిష్యత్‌లో గ్రామపంచాయతీలకు నిధుల కొరత ఉండకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధుల కేటాయిస్తున్నది. గ్రామ పరిపాలనలో అవినీతికి ఆస్కారం ఉండకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు తమ విధి నిర్వహణలో విఫలమైతే వారిని పదవి నుంచి తొలగించేందుకు కూడా వెనకాడబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతి నెలా పంచాయతీలకు రూ.339 కోట్లను విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారులు వచ్చిన నిధులను ఆయా గ్రామపంచాయతీలకు కేటాయిస్తున్నారు. పంచాయతీలో నివసిస్తున్న జనాభాకు అనుగుణంగా లెక్కలు వేసి వాటికి నిధులను మంజూరు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో డీపీవోలతో పాటు డీఎల్‌పీవోలు, కార్యాలయ సిబ్బంది వచ్చిన నిధులపై కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో ఉన్న అన్ని సబ్ ట్రెజరరీ కార్యాలయాలకు నివేదికలను సమర్పిస్తున్నారు. అనంతరం నేరుగా ఆయా గ్రామపంచాయతీల ఖాతాల్లో ప్రభుత్వ సొమ్ము జమ కానున్నది. జమ అయిన డబ్బును పంచాయతీ సర్పంచ్, పాలకమండలి సభ్యులు, కార్యదర్శులు ఖర్చు చేయనున్నారు. గ్రామపంచాయతీలకు ప్రతి నెలా రూ.339 కోట్లను ప్రభుత్వం కేటాయిస్తుండటంతో ఇక పల్లెల్లో మౌలిక వసతులు మారనున్నాయి.

పాక్ తీవ్రవాద చర్యలతో ప్రపంచానికే సమస్య

ఉగ్రవాదాన్ని ఎగదోస్తోందని మండిపడ్డ రాంమాధవ్

న్యూఢిల్లీ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): పాకిస్తాన్ కేవలం భారత్‌కు మాత్రమే సమస్య కాదని, మొత్తం ప్రపంచానికే సమస్యాత్మకంగా మారిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ అన్నారు. ఉగ్రవాదానికి పాక్ 'కేంద్ర బిందువు గా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రపంచానికే సమస్యాత్మకంగా మారిన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్తాన్ చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలు ఆ దేశంపై ఒత్తిడి తేవాలని పిలుపు నిచ్చారు.'యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్' నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇరు దేశాల మధ్య చర్చల ప్రస్తావన, దౌత్య సంబంధాలపై ప్రశ్నించగా... గత ఏడు దశాబ్దాలుగా ఇరు దేశాల సంబంధాలు ఆటుపోట్లకు లోనవుతూ, కొనసాగుతూనే ఉన్నాయని ఆయన తెలిపారు. భారత్ పొరుగున ఉన్న పాకిస్తాన్‌తో ఎప్పటికీ స్నేహపూర్వక సంబంధాలనే కోరుకుంటుందని, అయితే సరిహద్దు తీవ్రవాదంతోనే అసలు సమస్య అని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు పాక్ ఆర్థిక సాయం అందిస్తోందని, దీంతో కేవలం భారత్ మాత్రమే ఇబ్బంది పడటం లేదని, ప్రపంచంలోని చాలా దేశాలు ఆ దేశంలో సంబంధాలు నెరపడంలో ఇబ్బందులు పడుతూనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. పాక్‌తో సత్సంబంధాలు, చర్చలు కొనసాగించాలని గతంలో కొన్ని దేశాలు భారత్‌కు సూచించేవని, అయితే, పాక్ నేడు ఉగ్రవాదానికి మూల బిందువుగా మారడంతో ప్రపంచ దేశాలు ఏవీ అలాంటి సలహాలను మళ్లీ ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. ఆర్టికల్ 370 ని రద్దు చేసిన తర్వాత పాకిస్తాన్ ప్రపంచ దేశాల ముందు ఒంటరిగా మారిందని, పాక్ నిజ స్వరూపం బట్టబయలైందని రామ్ మాధవ్ అన్నారు. ఉగ్రవాదులను భారత్‌లో ప్రవేశ పెట్టాలని చేస్తున్న ప్రయత్నానలు భారత్ తిప్పి కొట్టిందన్నారు. సరిహద్దుల్లో మన జవాన్లు అప్రమత్తంగా ఉన్నారని అన్నారు. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటున్నదని అన్నారు.

శంషాబాద్‌లో పొగమంచు

విమానరాకపోకలకు అంతరాయం

రంగారెడ్డి,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): శంషాబాద్ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దట్టమైన పొగమంచు కారణంగా ఈ అంతరాయం ఏర్పడింది. దీంతో సింగపూర్ వెళ్లాల్సిన టైగర్ ఎయిర్‌లైన్స్ రెండు గంటలు, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రి వెళ్లాల్సిన విమానాలు గంట ఆలస్యం అయ్యాయి. అదేవిధంగా దట్టమైన పొగమంచు కారణంగా హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఖతార్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. బ్యాంకాక్ నుంచి దోహా వెళ్తున్న విమానంలో ఓ ప్రయాణికుడు గుండెపోటుకు గురయ్యాడు. దీంతో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేసి బాధితుడిని చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రయాణికుడు సూల్యహాయబ్(65) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని దోహాకు తరలించారు.

అంబులెన్స్ రాకలో ఆలస్యం

ప్రముఖ మరాఠీ నటి మృతి

ముంబై,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): సమయానికి అంబులెన్స్ చేరుకోలేని కారణంగా ఓ ప్రముఖ మరాఠీ నటి మరణించిన ఘటన విషాదాన్ని నింపింది. ఈ ఘటన మహారాష్ట్రకు 590 కిలోమీటర్ల దూరంలోని హింగోలి జిల్లాలో జరిగింది. జిల్లాకు చెందిన పూజా జుంజార్ (25) మరాఠీ చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకుంది. ఆమె ప్రస్తుతం గర్భవతి. పురిటి నొప్పులతో పూజా బాధపడుతుండగా, ప్రసవం కోసం ఆమెను తొలుత గోరేగాంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె ఓ శిశువుకు జన్మనివ్వగా, పుట్టిన కాసేపటికే పాప తీవ్ర అనారోగ్యంతో మృత్యువాత పడింది. పూజా జుంజార్ పరిస్థితి కూడా విషమంగా ఉందని గ్రహించిన వైద్యులు, వెంటనే హింగోలీలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సలహా ఇచ్చారు. హింగోర్ ఆసుపత్రి అక్కడికి 40 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అయితే, ఆమెను తీసుకెళ్లేందుకు అంబులెన్స్ లభించలేదు. ఆమె బంధువులు ఓ ప్రైవేటు అంబులెన్స్ ను తెచ్చి, పెద్దాసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో ప్రాణాలు పోయాయి. సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతోనే, వైద్యం అందక తమ బిడ్డ మరణించిందని కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు మరాఠీ చిత్రాల్లో నటించిన ఆమె, గర్భం దాల్చిన తరువాత నటనకు విరామం తీసుకుంది.

పేదలకు వరంగా
కళ్యాణలక్ష్మి: రేఖానాయక్

నిర్మల్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద బిడ్డల పెళ్లిళ్లకు బాసటగా నిలుస్తున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఈ పథకాలు పేదలకు అండగా నిలవడమే గాకుండా బాల్యవ ఇవాహాలకు చెక్ పెట్టాయని అన్నారు. కెసిఆర్ పేదలకు అండగాని లిచారని అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం లబ్దిదారులకు 1,00,116 రూపాయలు అందిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన ప్రతి పథకం ప్రజలకు మేలు చేకూర్చేదే అని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. కాగా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందుకున్న లబ్దిదారులు ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు
ప్రారంభించిన ఎమ్మార్వో

నిజామాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): జిల్లాలోని రెంజల్ మండల తహసీల్దార్ అసదుల్లా ఖాన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రెంజల్ మండలం దూపల్లి గ్రామం విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఆర్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలనీ, తద్వారా గిట్టుబాలు ధర పొందుతారని ఆయన అన్నారు. దళారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం అమ్మకూడదనీ.. వారు రైతులను అడ్డంగా ముంచుతారని ఈ సందర్భంగా ఎంఆర్ఓ రైతులను అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు.

మిగులు జలాలు విడుదలతో విద్యుదుత్పత్తి

శ్రీరాంసాగర్ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల

నిజామాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు ఎస్సారెస్పీకి భారీగా వరద వస్తుండడంతో ప్రాజెక్టు మిగులు జలాలను దిగువకు వదులుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో మిగులు జలాలను వరద గేట్లతో వదిలితే నీరు వృథా అవుతుందని భావించిన అధికారులు, కాకతీయ కాలువకు నీటిని వదిలారు. దీంతో కాకతీయ కాలువకు అనుసంధానంగా ఉన్న జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. మూడు టర్బయిన్లతో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించనట్లు డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఒక్కో టర్బయిన్‌తో 7.9 మెగావాట్లు, మూడు టర్బయిన్లతో మొత్తం 22.8 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. 2016లో ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో మిగులు జలాలను ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా 321 టీఎంసీలు గోదావరిలోకి వదిలారు. మళ్లీ ఈ ఏడాది మిగులు జలాలు 6వేల క్యూసెక్కులు ఆదివారం వదిలారు. ఈ వానాకాలం ప్రారంభమైనా ఎగువ నుంచి జూలై, ఆగస్టు నెలల్లో ఆశించిన స్థాయిలో వరద ఎస్సారెస్పీకి రాలేదు. దీంతో ఆయకట్టు రైతులు నిరాశ చెందారు. సెప్టెంబర్ నెలలో భారీగా ఇన్ఎ÷-లో కొనసాగింది. దీంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరిగింది. అక్టోబర్‌లో ప్రాజెక్టు నిండకుండలా మారింది. ఎగువన మహారాష్ట్రలోని ప్రాజెక్టులు విష్ణుపురి, బాలేగావ్,అముదుర, గైక్వాడ్, బాబ్లీ పూర్తిస్థాయిలో నిండడంతో మిగులు జలాలను దిగువకు వదిలారు. దీంతో పాటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో గోదావరి పరీవాహకంలో భారీగా వర్షాలు కురిశాయి.

దీంతో ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలోకి చేరింది. ఎగువన మహారాష్ట్రలోని విష్ణుపురి ప్రాజెక్టు నుంచి శనివారం సాయంత్రం మిగులు జలాలను గోదావరిలోకి వదిలారు. మొదట 20వేల క్యూసెక్కులు వదిలారు. ఆ తర్వాత 40 వేల క్యూసెక్కులకు పెంచారు. దీంతో అధికారులు నీటిని వృథా చేయకుండా కాకతీయ కాలువ ద్వారా మిగులు జలాలను దిగువకు వదులుతున్నారు.

వరుస వర్షాలకు దెబ్బతిన్న పత్తి,వరి

ఆందోళనలో రైతులు

జనగామ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఇట